ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 13 జూలై 2025



సరిహద్దులు దాటుతున్న ఇసుక

- యథేచ్ఛగా అక్రమ రవాణా
- పాపాఘ్ని సరిహద్దు గ్రామాల్లో డంపింగ్
- రాత్రివేళల్లో కర్ణాటక రాష్ట్రాలకు తరలింపు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు



పాపాఘ్ని నదిలో నుంచి ట్రాక్టర్లకు ఇసుకను లోడు చేస్తున్న కూలీలు



సరిహద్దు గ్రామమైన గుంటిపల్లె వద్ద డంప్ చేసిన ఇసుక

పెద్దతిప్పసముద్రం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దులో ఉన్న టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె సమీపంలో గల పాపాఘ్ని నది నుంచి ఇసుకను అక్రమంగా తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా ఉండే కొందరు నాయకుల అండదండలతో పాపాఘ్ని నది నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలించేస్తున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ ఓ వైపు చెబుతున్నా.. మరో వైపు అక్రమార్కులు మాత్రం ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా యంత్రాలతో తరలించి సొమ్ము చేసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఇసుక అక్రమంగా తరలించకుండా ప్రత్యేక నిఘా పెట్టామని, నిబంధనల మేరకే ఇసుకను ఉచితంగా తరలించినట్లు అధికారులు చెబుతున్నా పాపాఘ్ని నది నుంచి నిబంధనలకు విరుద్ధంగా సరిహద్దు గ్రామాల్లో పగలు డంప్ చేసి రాత్రి పూట గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

స్థానిక నాయకుల అండదండలతోనే...

టి.సదుం గ్రామానికి చెందిన కొందరు కూటమి నాయకుల అండదండలతో పాపాఘ్ని నది రామాపురం సమీపంలో కొందరు ఇసుకను తరలిస్తున్నారు. కూటమి నాయకులతో పాటు వైసీపీ నాయకులు గుంటిపల్లె వద్ద గల పొలాల్లో డంప్ చేసి అక్కడి నుంచి కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఉచిత ఇసుకను ప్రజల అవసరాల మేరకు గృహనిర్మాణాలకు ఉచితంగా అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అయితే కొందరు నాయకులు నిబంధనలకు విరుద్ధంగా హంద్రీ-నీవా కాలువకు పాపాఘ్ని నది నుంచి ఇసుకను తరలించడం వలన గృహ లబ్ధిదారులకు అన్యాయం జరుగుతున్నదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

భూగర్భజలాలు అడుగంటుతున్నాయి

వైసీపీ ప్రభుత్వంలో టి.సదుం పంచాయతీ జంబుగానిపల్లె నుంచి రామాపురం వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర పాపాఘ్ని నదిలో ఉన్న ఇసుకను మొత్తం ఖాళీ చేయడంతో ఈ గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, కనీసం ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలోనైనా భూగర్భ జలాలు పూర్తి స్థాయిలో ఉంటాయని గ్రామస్థులు ఆశించారు. అయితే ఇక్కడ కూటమి నాయకులే గుట్టు చప్పుడు కాకుండా ఇసుకను ఖాళీ చేస్తున్నారు. పాపాఘ్ని నదిలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు చేపట్టి ప్రభుత్వానికి భారీగా గండి కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం పట్ల ప్రజలు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు.

సరిహద్దుల్లో కొరవడిన పోలీసుల నిఘా

సరిహద్దు చెక్‌పోస్టుల్లో పోలీసుల నిఘా లేకపోవడంతో యథేచ్ఛగా తరలించుకుంటున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది లేకపోవడం, స్థానిక ఎస్‌ఐ ఎప్పుడు చూసినా స్టేషన్‌లో అందుబాటులో ఉండకపోవడం ఇసుకాసురులకు కలిసి వస్తోందని ప్రజలు అంటున్నారు. దీనికి తోడు రెవెన్యూ అధికారులు ఇసుకను తరలించే వారికి అండదండగా ఉంటూ వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారులు అభ్యంతరం చెబితే మండల స్థాయి నాయకులు ఇన్‌చార్జ్ దగ్గరి నుంచి ఫోన్ చేయించి అధికారులు అటువైపు రాకుండా చేస్తున్నారని, స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇసుక అక్రమంగా తరలించకుండా ఎక్సైజ్ అధికారులు అడ్డుకునే వారు ఇప్పుడు వారు లేకుండాపోవడంతో ఇసుకాసురులకు మార్గమం సుగమం అయింది.

ఇసుకను హంద్రీనీవా కాలువకు తరలించేస్తున్నారు

పాపాఘ్ని నది ఇసుకను గృహ అవసరాలకు మాత్రమే వినియోగించాలని ప్రభుత్వం చెబుతున్నా అధికారులు మాత్రం నిబంధనలను తుంగలో తొక్కి హంద్రీనీవా కాలువ నిర్మాణాలకు పాపాఘ్ని నది ఇసుకను తరలిస్తుండడంతో గృహ నిర్మాణ లబ్ధిదారులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. గతంలో పాపాఘ్ని నది నుంచి గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇసుకను రూ.1500 నుంచి 1800 లోపు లభించేది. హంద్రీనీవా కాలువ నిర్మాణానికి ఇసుకను అధిక ధరలకు తరలిస్తుండడంతో ట్రాక్టర్ యాజమానులు గృహ నిర్మాణ లబ్ధిదారులకు కూడా అదే రేటుకు తోలుతామని లేకపోతే గిట్టుబాటు కాదని అంటుండంతో గృహనిర్మాణ లబ్ధిదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. హంద్రీనీవా కాలువ నిర్మాణాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజంపేట ఇసుక రీచ్ నుంచి ఇసుకను తరలించుకోవాలని ఆదేశాలు ఉన్నా వాటిని తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించి హంద్రీనీవా కాలువ నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో గృహనిర్మాణ లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి గృహనిర్మాణ లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఈ విషయమై పెద్దతిప్పసముద్రం తహసీల్దార్ శ్రీరాములు నాయక్‌ను వివరణ కోరగా.. కర్ణాటక సరిహద్దు గుంటిపల్లి వద్ద ఇసుకను డంపు చేసిన విషయం తమ దృష్టికి రాలేదని, అక్కడ రాత్రి వేళల్లో గస్తీ చేసేందుకు స్థానిక వీఆర్‌వో, వీఆర్‌ఏలను నియమించామని, పట్టుకుంటే వారు ఎంతటి వారైనా వాహనాలను సీజ్ చేసి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. అలాగే హంద్రీనీవా కాలువ నుంచి ఇసుకను తరలించేందుకు ఎలాంటి అనుమతులు లేవని, గృహ నిర్మాణ అవసరాల నిమిత్తం ఇసుకను తరలించుకుంటామని తమకు తెలియజేస్తున్నారని, అలా లేనిపక్షంలో అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నరసింహస్వామికి విశేష పూజలు



గుర్రంకొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, గోకుల్, వెంకీ, వరద, సిబ్బంది నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లె-ధర్మవరం మధ్య ప్రత్యేక రైలు

- నేటి నుంచి రాకపోకలు ప్రారంభం

ములకలచెరువు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లెకు నుంచి ధర్మవరానికి ఆదివారం నుంచి ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం నుంచి ఈ రైలు రాకపోకలు సాగించనుంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ మార్గంలో ప్రత్యేక రైలు నడుపుతున్నారు. ఈ రైలు చర్లపల్లె నుంచి పగిడిపల్లె, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడే జంక్షన్, సత్తెనేపల్లె, గుంటూరు, తెనాలి జంక్షన్, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, శ్రీకాళహస్తి, రేణిగుంట జంక్షన్, తిరుపతి, పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లె, కదిరి, ధర్మవరం వరకు నడుస్తుంది. ఈనెల 13, 20, 27, ఆగస్టు 3, 10, 17, 24 తేదీల్లో చర్లపల్లె నుంచి ధర్మవరం వరకు నడుస్తుంది. అలాగే ఇదే రైలు ఈనెల 14, 21, 28, ఆగస్టు 4, 11, 18, 25వ తేదీల్లో ధర్మవరం ఉంచి చర్లపల్లె వరకు నడుస్తుంది. ఈ ప్రత్యేక రైలు జిల్లాలోని మదనపల్లె, కలికిరి, పీలేరు రైల్వేస్టేషన్లలో మాత్రమే నిలుస్తుంది. ములకలచెరువు రైల్వేస్టేషన్‌లో మాత్రం అధికారులు స్టాపింగ్ ఇవ్వలేదు.

నేడు అన్నమయ్య ప్రాజెక్టు పరిశీలన

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం కోసం సాంకేతిక నిపుణుల కమిటీ ఆదివారం ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను పరిశీలించనుంది. ప్రాజెక్టు డిజైన్ నిర్మాణం, కార్యాచరణ సవాళ్లను అధ్యయనం చేసేందుకు ఆరుగురితో కూడిన ఒక నిపుణుల కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కమిటీ శనివారం కడపలోని ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీరు కార్యాలయంలో సమావేశమైంది. ఈ కమిటీలో డిజైనింగ్ ఎక్స్‌పర్ట్ రమేశ్ కుమార్, హైడ్రా మెకానికల్ ఎక్స్‌పర్ట్ రిటైర్డ్ సత్యనారాయణన్, జియాలజిస్ట్ విభాగానికి చెందిన రిటైర్డ్ డీజీ ఎం.రాజు, డిజైనింగ్ అప్రూవ్ అథారిటీ విజయవాడ సీడీవో, హైడ్రాలజీ నిపుణుడు విజయవాడకు చెందిన హైడ్రాలజీ చీఫ్ ఇంజనీరు, కమిటీ కన్వీనరుగా కడప ప్రాజెక్టుల విభాగానికి సంబంధించిన సి.రామచంద్రమూర్తిని నియమించారు. ఈ కమిటీ ప్రాజెక్టు పునర్నిర్మాణానికి సంబంధించి అడ్డంకులు అవరోధాలను దృష్టిలో ఉంచుకుని ఉత్తమ డిజైన్ ప్రత్యామ్నాయాన్ని అందించనుంది. ఈ క్రమంలో ప్రాజెక్టుకు సంబంధించిన అనేక విషయాలపై శనివారం చర్చించారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో కూడా పరిశీలన చేసి నిర్ణీత సమయంలో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఇందులో భాగంగా వీరు ఆదివారం రాజంపేటలోని అన్నమయ్య ప్రాజెక్టు ఆనకట్ట తెగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించనున్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

- సబ్‌జైలు ఖైదీలతో అదనపు ఎస్పీ వెంకటాద్రి



సబ్‌జైలులో ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని అదనపు ఎస్పీ వెంకటాద్రి సబ్‌జైలు ఖైదీలకు సూచించారు. శనివారం రాయచోటి పట్టణంలోని సబ్‌జైలులో మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే నష్టాల గురించి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం, గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలను వినియోగించడం వలన ఒక జీవితాలు నాశనం కావడమే కాకుండా కుటుంబాలు కూడా రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మత్తు పదార్థాల వినియోగం వలన మనిషి ఆరోగ్యం క్షీణించడమే కాకుండా సమాజంలో అలాంటి కుటుంబాలకు విలువ లేకుండా పోతుందన్నారు. నాటుసారా తయారీ, విక్రయాల వలన జైలు పాలవుతారన్నారు. నేరాలు చేసి జైలుకు వచ్చిన మీరు ఇక్కడ సత్ప్రవర్తనతో మెలిగి బయటకు వెళ్లాక మంచి మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్, అసిస్టెంట్ అధికారి జోగేంద్ర, డీఈవో సుబ్రహ్మణ్యం, మానవతా సంస్థ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి, డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్, ఎస్‌ఐ హుస్సేన్‌బాషా, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురి మృతి

- ఇద్దరూ బావమరదళ్లు.. ● త్వరలో ఇద్దరికీ పెళ్లి



మృతి చెందిన బావ మరదలు సాయిక్రిష్ణ, అనిత

రైల్వేకోడూరు రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట పంచాయతీ పరిధిలోని ప్రధాన జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతీ, యువకుడు మృతి చెందారు. కోడూరు ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు... ఓబులవారిపల్లికి చెందిన వనమాల సాయిక్రిష్ణ (25), అనిత (21) ఇరువురు తిరుపతిలోని మృతుడి అన్న అజయ్ ఇంటికి వెళ్లి స్కూటీలో బయలుదేరారు. శెట్టిగుంట పంచాయతీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన ఇద్దరు బావ మరదళ్లు. వీరికి త్వరలో వివాహం కానుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించి మృతదేహాలను కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

నందలూరు, జూలై 12 : (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కడప జిల్లాలోని నందలూరు, వనిపెంట, తొండూరులోని బాలికల గురుకులాలు, కమలాపురం, జమ్మలమడుగుల్లోని బాలుర గురుకుల పాఠశాలల్లో మిగిలిన సీట్లకు ఈనెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరి తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఈనెల 14, 15 తేదీల్లో దరఖాస్తు చేసుకోవడానికి వీలుంటుందన్నారు. కమలాపురం బాలుర పాఠశాలలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో, జమ్మలమడుగు బాలుర పాఠశాలలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీలున్నాయన్నారు. నందలూరు బాలికల గురుకులంలో 5, 7, 8 తరగతుల్లో, తొండూరు గురుకులంలో 5, 6వ తరగతిలో, వనిపెంట గురుకులంలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అర్హులైన వారు ఆయా పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

లంకమల, పాలకొండల్లో కూంబింగ్



రోళ్లబోడు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

సిద్దవటం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): లంకమల, పాలకొండల్లో కూంబింగ్ నిర్వహించినట్లు సిద్దవటం రేంజర్ బి.కళావతి, కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ తెలిపారు. సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రోళ్లబోడు, గొల్లపల్లె, సిద్దవటం ఫారెస్ట్ బీట్‌లలో సమస్యాత్మక అనుమానిత అటవీ ప్రదేశాల్లో ఎర్రచందనం తరలిపోకుండా శనివారం కూంబింగ్ నిర్వహించామన్నారు. కడప ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని భాకరాపేట ఫారెస్ట్ బీట్‌లో శనివారం కూంబింగ్ నిర్వహించామన్నారు. భాకరాపేట, మిట్టపల్లె, మాధవరం, మూలపల్లి, మాచుపల్లె, నేకనాపురం తదితర గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనపడితే సమాచారం తెలపాలని కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ఓబులేసు, ఫారెస్ట్ బీట్ సహాయ అధికారులు, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఫారెస్ట్ సిబ్బంది, కిషోర్‌కుమార్, ఇందిర, ప్రొటెక్షన్ వాచర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గజదొంగ అరెస్ట్
● 102 గ్రాముల బంగారం, రూ.75 వేలు నగదు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన ఏఎస్పీ
7

వైభవంగా సౌమ్యనాథస్వామి రథోత్సవం



రథంపై ఆశీనులైన శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడు



రథాన్ని లాగుతున్న భక్తులు

నందలూరు, జూలై 12 : (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులను అత్యంత సుందరంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్ కుమార్, మనోజ్‌కుమార్, సునీల్‌కుమార్, సాయిస్వాముల మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి రథాన్ని ముందుకు నడిపించారు. రథోత్సవం ముందు నిర్వహించిన కోలాటాలు భక్తులను అలరింపజేశాయి. పెద్దఎత్తున హాజరైన భక్తుల గోవిందనామస్మరణలతో మాడవీధులు మార్మోగాయి. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. రాజంపేట రూరల్ సీఐ వీవీ రమణ, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.



రథం ముందు చేస్తున్న కోలాటాలు

భక్తులకు అన్నదానం

రథోత్సవానికి వచ్చిన భక్తులకు రీజెన్సీ నలందా విద్యా సంస్థల అధినేత జీఎన్ నాయుడు ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సౌమ్యనాథసేవా ట్రస్టు అధ్యక్షుడు ఎద్దల సుబ్బరాయుడు, కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, ఎద్దుల విజయసాగర్, రీజెన్సీ నలందా స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ దశరథరామయ్య, ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై సౌమ్యనాథస్వామి

సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అశ్వవాహనంపై స్వామి పుర వీధుల్లో విహరించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో కాయ కర్పూరం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.

పీలేరు వైసీపీలో డిష్యూం..డిష్యూం...

- మాజీ ఎమ్మెల్యే సమక్షంలో నాయకుల బాహాబాహీ
- ఇద్దరు ప్రజాప్రతినిధులపై దాడి?



పీలేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నన్నాళ్లు పీలేరు వైసీపీలో నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు శుక్రవారం జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఒక్కసారిగా బయటపడినట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలోనే పీలేరుకు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాహాబాహీకి దిగడమే కాకుండా పీలేరు పట్టణానికి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులపై దాడి చేసినట్లు శనివారం ఉదయం నుంచి స్థానికంగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం పీలేరు-కడప మార్గంలోని ఓ కల్యాణ మండపంలో పీలేరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి వైసీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు హాజరయ్యారు. నాయకుల ప్రసంగాలు పూర్తయిన తరువాత ఇటీవల జరిగిన పార్టీ విస్తరణలో పదవులు పొందిన పీలేరు నియోజకవర్గానికి చెందిన నాయకులకు నియామకపత్రాలు అందించే కార్యక్రమం చేపట్టినట్లు సమాచారం. ఆ సమయంలో ఒక్కసారిగా పీలేరుకు చెందిన నాయకుల మధ్య విభేదాలు బహిర్గతమైనట్లు తెలిసింది. పీలేరుకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ విద్యార్థి విభాగానికి చెందిన ఇద్దరు నాయకుల మధ్య వాగ్వాదం చెలరేగి ఇరువర్గాలు ఒకరిపై మరొకరు పిడిగుద్దులు కురిపించుకునే స్థాయికి వెళ్లినట్లు తెలిసింది. అంతటితో ఆగకుండా కల్యాణ మండప ప్రాంగణంలోనే పీలేరుకు చెందిన ఆ ఇద్దరు ప్రజాప్రతినిధులను తరుముకోవడంతో భయపడి వారిద్దరూ అక్కడే ఉన్న గదిలో చాలాసేపు దాక్కోవాల్సి వచ్చిందని తెలిసింది. తేరుకున్న ఇతర నాయకులు ఇరువర్గాలను శాంతింపజేసి ఒకరి తర్వాత ఇంకొకరిని అక్కడి నుంచి పంపించేసినట్లు సమాచారం.

టిప్పర్ ఢీ.. ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు ● సంతకు వెళుతుండగా ప్రమాదం



బాల నాగయ్య మృతదేహం, టిప్పర్ ఢీకొన్న చోట ప్రమాద దృశ్యం

దువ్వూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మేకపిల్లను విక్రయించేందుకు సంతకు వెళుతుండగా టిప్పర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దువ్వూరు మండలం క్రీస్తురాజపురం నాలుగు రోడ్ల వద్ద జరిగింది. ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.... రాజుపాళెం మండలం వెలువలి గ్రామానికి చెందిన బాలనాగయ్య (42), హుసేనయ్య (60) శనివారం ఉదయం బైకుపై మేకపిల్లను తీసుకుని మైదుకూరు సంతకు బయల్దేరారు. దువ్వూరు సమీపంలోని క్రీస్తు రాజపురం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా బాలనాగయ్య ప్రాణాలు కోల్పోయాడు. హుసేనయ్య చికిత్స పొందుతున్నా రు. ఈ మేరకు కేసు నమోదు అయిందని టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ వివరించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ఓబులవారిపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారిలో చిన్నఓరంపాడు వద్ద కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. చెన్నూరుకు చెందిన సోమశిల శ్రీనివాసులు (50) తమలపాకు తోటల్లో పనులు చేస్తూ ఉండేవారు. హోటల్‌కు మధ్యాహ్నం భోజనానికి టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై వెళుతుండగా హైదరాబాద్ నుంచి తిరుమల వెళుతున్న ఇన్నోవా వాహనం ఢీకొనడంతో కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆవు దాడిలో మహిళ...



లక్కిరెడ్డిపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆవు దాడి చేయడంతో సుజాతమ్మ (45) అనే మహిళ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుజాతమ్మ జెర్సీ ఆవుల పోషణతో జీవించేది. శనివారం ఉదయం ఆవులను మేపుకోసం వదిలి కాపలా కాస్తుండగా, అదే ప్రాంతంలో మేస్తున్న మరో ఆవు ఆమెపై దాడి చేసి కొమ్ములతో పొడిచింది విషయం గమనించిన పశువుల కాపరులు ఆమెను రాయచోటిలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు..



లక్కిరెడ్డిపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ సరిచేస్తుండగా షాక్ కొట్టడంతో రాబిన్ బంద్ర (23) అనే యువకుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ లైన్ పనుల నిమిత్తం జార్ఖండ్ నుంచి వచ్చిన కొంత మంది రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో విద్యుత్ లైన్ పనుల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. శనివారం మండలంలోని దిన్నెపాడు సమీపంలోని ఎర్రంరెడ్డిగారిపల్లె వద్ద విద్యుత్ వైర్లు సరిచేస్తుండగా రాబిన్ బంద్ర అనే యువకుడు విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. స్థానికులు అతనిని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులుతెలిపారు.

26 బస్తాల చౌక బియ్యం పట్టివేత

చెన్నూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పోలీసుస్టేషను పరిధి పాలెంపల్లె రైస్‌మిల్లు సమీపంలో 26 బస్తాల చౌక బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. అక్రమంగా తరలించేందుకు బియ్యం బస్తాలు సిద్ధంగా ఉన్నాయని అందిన సమాచారంతో శనివారం సీఐ క్రిష్ణారెడ్డి సిబ్బందితో దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దేవిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అనంతపురం జిల్లా యాడికి మండలంలో ఘటన



ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యవసాయ పొలంలో పడ్డ విజయభాస్కర్‌రెడ్డి



విజయభాస్కర్‌రెడ్డి మృతదేహం

యాడికి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం అనంతపు రం జిల్లా యాడికి మండలం రైవాల మడుగు- చందన గ్రామాల మధ్య జరిగింది. ఈ సంఘటనలో కడప జిల్లా సింహాద్రిపురం మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన విజయ భాస్కర్ రెడ్డి (43) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు చెర్లోపల్లికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి నంద్యాల జిల్లా ప్యాపిలి వద్ద ఉన్న అరుణా చలేశ్వర ట్రాన్స్‌పో ర్ట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో 20రోజులకు ఒకసారి చెర్లోపల్లి గ్రామానికి వెళ్లి వస్తుండేవాడు. శనివారం ఉదయం విధు లను ముగించుకొని సొంత గ్రామానికి ద్విచక్రవాహనంపై బయ ల్దేరాడు. రైవాలమడుగు- చందన గ్రామాల మధ్య రోడ్డు మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దీంతో విజయభాస్కర్‌రెడ్డి వ్యవసాయ పొలంలోకి ఎగిరిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అత డు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలి పారు. మృతుడి భార్య అమరావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

గుభాళించని పూలు



కానగూడూరు మార్కెట్‌లో పూల క్రయ విక్రయాలు

●పీడిస్తున్న తెగుళ్లు, ఆశించిన ధరల్లేక...

● నిరాశ వ్యక్తం చేస్తున్న పూల రైతులు



కుప్పలుగా పోసిన మల్లెలు

దువ్వూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పండుగలు, పెళ్లిళ్లు, శుభకార్యాలు, ఇతరత్రా వేడుకలకు పూలను వాడటం సాంప్రదాయంగా వస్తోంది. పూల పరిమళంతో పులకించని తనువు, మనుషులు ఉండరనడంలో అతిశయోక్తి లేదు. ఇలాంటి పూల పంట సాగు చేస్తున్న రైతు బతుకు మాత్రం గుభాళించడంలేదు. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో నష్టాల పాలవుతున్నారు.

దువ్వూరు మండలంలో కానగూడూరు ప్రాంతం పూల సాగుకు పెట్టింది పేరు. అలాగే క్రిష్ణంపల్లె, ఇడమడక, జిల్లేళ్ల, టంగుటూరు గ్రామాల్లో వివిధ రకాల పూలు సాగు చేస్తారు. వీటిని కానగూడూరు గ్రామానికి తెచ్చి అక్కడున్న మార్కెట్‌లో విక్రయిస్తారు. ఇక్కడ నుంచి హైదరాబాదు, కర్నూలుకు కూడా పూలను తరలిస్తారు. మల్లెలు, సంపెంగి, జాజిపూలతోపాటు రెడ్ రోజా సాగు చేస్తారు. వ్యయప్రయాసల కోర్చి 200 ఎకరాలు దాకా ఈ ప్రాంతంలో సాగు చేశారు.

వేధిస్తున్న తెగుళ్లుతో...

పూల సాగు చేసిన రైతులు ఎక్కువగా పండుగల సమయంలో లాభాలు గడిస్తారు. ప్రస్తుతం తోటల్లో రేగ్గాయిపురుగు, త్రిప్స్, తెల్లదోమ, ఎర్రదోమ లాంటి తెగుళ్ల ఆశిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తెగుళ్లతో మల్లెతోటల్లో ఎర్రమొగ్గ ఏర్పడి దిగుబడిపై ప్రభావం చూపుతోంది. వీటి నివారణకు పలుసార్లు మందులు పిచికారి చేస్తున్న నియంత్రణ కావడం లేదని వాపోతున్నారు. పంట దిగుబడి చేతికందాలంటే ఆరు దఫాలుగా పిచికారి చేయాల్సి వస్తోందంటున్నారు. దీనికి రూ.12వేలు దాకా ఖర్చు వస్తోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అందిన దిగుబడి, మార్కెట్‌లో విక్రయాలతో సరిచూసుకుంటే లాభాలు ఆశాజనకంగా లేవని పూల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలోలు చొప్పున సీజన్‌ను బట్టి మల్లెల ధర కిలో రూ.150, జాజి కిలో రూ.170, సంపెంగి రూ.50, రెడ్‌రోజా రూ.100 ధర పలుకుతున్నాయి. ఒక్కోసారి ఆ ధర మరికొంత పెరుగుతున్నా గిట్టుబాటు కావడం లేదని రైతుల ఆవేదన.

ధరలు నిరాశ పరుస్తున్నాయి



పూల ధరలు నిరాశ పరుస్తున్నాయి. తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేస్తున్నా పెద్దగా ప్రభావం కనిపించడంలేదు. 15 ఏళ్లుగా పూల సాగు చేస్తున్నాను. కొన్నిసార్లు మంచి లాభాలు వచ్చాయి. ఇప్పుడు కూలీ లు, మందుల ఖర్చులు ఎక్కువగా వస్తున్నా యి. దీంతో ఆదాయం అందని ద్రాక్షలా మారింది. ఒకటిన్నర ఎకరంలో మల్లెలు సాగు చేశాను. రోజువారీగా పూలు కోసి అమ్మితే ఇంటి ఖర్చులకు వస్తోంది.

- సూర్యనారాయణ, పూల రైతు, కానగూడూరు

అంతర్‌రాష్ట్ర గజదొంగ అరెస్ట్

● 102 గ్రాముల బంగారం, రూ.75 వేలు నగదు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ వెంకటాద్రి



వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ, స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, నగదు

రాయచోటిటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న రంగనాథం కిరణ్ అనే వ్యక్తిని అన్నమయ్య జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాయచోటి పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి వివరాలను వెల్లడించారు. ఉమ్మడి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని గూడూరు పట్టణం గాంధీనగర్‌కు చెందిన రంగనాథం కిరణ్ అనే వ్యక్తి బేకరీలో పని చేసేవాడు. అక్కడ వచ్చే డబ్బు వ్యసనాలకు చాలకపోవడంతో బస్టాండు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో చోరీలు చేసేవాడు. క్రమంగా ఇళ్లలో చోరీలకు అలవాటుపడ్డాడు. అన్నమయ్య జిల్లా పరిధిలోని వీరబల్లి, చిట్వేలు, రైల్వేకోడూరు ప్రాంతా ల్లో చోరీలు చేశాడు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, రూరల్ సీఐ వరప్రసాద్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సబ్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, వీరబల్లి ఎస్ఐ నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శనివారం వీరబల్లి మండలం ఓదివీడు గ్రామం క్రాస్ వద్ద నిందితుడిని అరెస్టు చేసి 10 లక్షల విలువ చేసే 102 గ్రాముల బంగారు నగలు, రూ.75వేలు నగదు స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరుపెట్టినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. నిందితుడు అన్నమయ్య జిల్లాతో పాటు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, విశాఖపట్నం, ఎన్టీఆర్, కృష్ణ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, ప్రకాశం, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో మొత్తం 60 కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు తెలియజేశారు. ఇతర రాష్ట్రాల్లో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడని వివరించారు. ఈసందర్భంగా పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించినట్లు తెలిపారు.

నేటి నుంచి అండర్-16 మెన్స్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 13వ తేదీ ఆదివారం నుంచి ఈనెలాఖరు వరకు ఏసీఏ అండర్-16 మెన్స్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్‌మ్యాచ్‌లు జరుగ నున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఇందులో కడప, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన క్రికెట్ జట్లు పాల్గొంటు న్నాయన్నారు. తొలుత కర్నూలు-నెల్లూరు, కడప-చిత్తూరు జట్ల మధ్య 13వ తేదీ నుంచి 15 వరకు మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. 17 నుంచి 19వ తేదీ వరకు కడప- కర్నూలు, అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య పోటీలు ఉంటాయని తెలిపా రు. 20న ఆటకు విశ్రాంతి దినం. 21 నుంచి 23 వరకు అనంతపురం- చిత్తూరు, కడప-నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌లు సాగుతాయన్నారు. 24న ఆటకు విశ్రాంతి దినం, 25 నుంచి 27 వరకు చిత్తూరు-నెల్లూరు, అనం తపురం-కర్నూలు జట్ల మధ్య పోరు సాగుతుందన్నారు. 28వ తేదీ ఆటకు విశ్రాంతి. చివరగా 29 నుంచి 31 వరకు అనంతపురం-కడప, చిత్తూరు- కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

పీలేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం బండ్లవంక నుంచి ఈనెల 6న అదృశ్యమైన జోష్ణవిని పీలేరు పోలీసులు శని వారం గుర్తించారు. హాస్టల్ వెళ్లాలన్న బెంగతో ఆ బాలిక భయపడి ఇంటి నుంచి పారిపోయి తిరుమలకు చేరుకుంది. అక్కడ పలు మార్లు దైవదర్శనానికి వెళుతుండడాన్ని గమనించిన విజిలెన్స్ అధికారులు ఆమెను విచారించగా ఇంటి నుంచి పారిపోయి వచ్చినట్లు తెలిసింది. దీంతో వారు పీలేరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పీలేరు పోలీసులు ఆమెను తీసుకువచ్చారు. పీలేరు సర్కిల్ కార్యాలయంలో ఆమెను ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.

పోక్సో కేసులో యువకుడు అరెస్టు : డీఎస్పీ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

వేంపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి ఓ మైనర్ బాలికను నమ్మించి మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. శనివారం వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వేంపల్లె మండలం పక్కీరుపల్లెకు చెందిన మడక బాబు, బాలిక మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదీ మేకలు మేపుకునేందుకు బాలిక వెళ్లింది. అక్కడ నుంచి మడక బాబుకు ఫోన్ చేసి రావాలని కోరగా యువకుడు వెళ్లాడు. ఆ సమయంలో తండ్రి రావడంతో బాలిక యువకుడిని వెళ్లిపోవాలని చెప్పి భయంతో అడవిలోకి పారి పోయింది. దీంతో బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన మడక బాబు, అతని స్నేహితులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తుండగా... బాలిక తరపు బంధువులు పోలీసు స్టేషన్‌ను ముట్టడించి తీవ్ర గందరగోళం సృష్టించారు. రాత్రికి బాలిక ఆచూకీ లభ్యం కావడంతో రిమ్స్‌కు తరలించి చికిత్స చేయించారు. మహిళా ఎస్ఐ జ్యోతి బాలిక నుంచి వివరాలు సేకరించగా ఇరువురు మూడేళ్లుగా ప్రేమలో ఉన్నామని వెల్లడించింది. మైనర్ బాలిక అయినందున యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. చక్రాయపేట బస్టాండ్ వద్ద ఉండగా శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కాగా, బాలిక అదృశ్యం ఘటన నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ ముట్టడించిన వారిపై కేసు నమోదు విషయంపై ఎస్పీ అశోక్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తామన్నారు. న్యాయ సలహా తీసుకున్న తర్వాత కోర్టులో అపీల్ చేస్తామన్నారు. సీఐ నరసింహులు, ఎస్ఐలు తిరుపాల్ నాయక్, రంగారావు పాల్గొన్నారు.

అనుమానాస్పద కేసును ఛేదించిన పోలీసులు



నిందితురాలితో సీఐ మోహన్, పోలీసులు

ఖాజీపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పనపల్లె గ్రామానికి చెందిన నక్కా శ్రీనివాసులు అనుమానాస్పద మృతి కేసును ఛేదించినట్లు సీఐ మోహన్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఖాజీపేటలో శనివారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అప్పనపల్లెకు చెందిన నక్కా శ్రీనివాసులుకు ఇరువురితో వివాహం జరిగింది. మొదటి భార్య లక్ష్మీదేవి వదలిపెట్టి వెళ్లడంతో చాపాడుమండలం తిప్పిరెడ్డిపల్లెకు చెందిన సునీతను 13 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. మద్యం మత్తులో పిల్లల ముందే తనను కొడుతుండగా.. ఆమె ఒక్కసారిగా తోయడంతో పక్కన ఉన్న మంచుకోడు తగులుకుని కింద పడ్డాడు. అయితే భర్త లేస్తే తనను చంపుతాడన్న భయంతో తిరిగి మంచంకోడుకు తలను కొట్టడంతో మృతి చెందాడు. కాగా ఈ విషయం బయటకు వస్తే పిల్లలు అనాథలు అవుతారని ఉరి వేసుకుని చనిపోయాడని నమ్మించి... మొదటి భార్య లక్ష్మీదేవికి సమాచారం ఇవ్వకుండా జూన్ 12వ తేదీ దహన కార్యక్రమాలు నిర్వహించారు. అయితే మొదటి భార్య అనుమానం వ్యక్తం చేసి జూలై 1వ తేదీ ఫిర్యాదు చేయగా 2వ తేదీ తహసీల్దారు, రిమ్స్ డాక్టర్లు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఎక్కడ నిజం బయట పడుతుందోనని అతని రెండో భార్య సునీత స్థానిక సచివాలయంలో పనిచేసే సెక్రటరీ భాగ్యశ్రీని కలిసి నిజం చెప్పడంతో ఆమేరకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సునీతను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ మోహన్ తెలిపారు.

బొంగుబజార్‌లో అగ్నిప్రమాదం

● పాత టైర్లు, ప్లాస్టిక్ సంచులు దగ్ధం

ప్రొద్దుటూరు ,జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీలోని బొంగుబజార్‌లోని ఖాళీ ప్రదేశంలో వేసిన వ్యర్థాలు అంటుకొని పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. శనివారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో బొంగు బజార్‌కు సంబంధించిన పాతటైర్లు, ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ బాటిల్స్ అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సహాయ అధికారి బసివి రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా అదుపులోకి తెచ్చారు. ఈ పాత సామాను అంతా మహ్మద్ ఫరూక్ అనే వ్యక్తికి సంబంధించినవి. వీటి విలువ రూ.5లక్షలు ఉంటుందని యజ మాని తెలిపారన్నారు. ఎవరో అజాగ్రత్తగా తాగిపడేసిన బీడీ సిగరేట్ వలన అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని అధికారులు వెల్లడిస్తున్నారు



మంటలు ఎగిసిపడుతున్న దృశ్యం, ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

చిలేకాంపల్లెలో దేవర ఎద్దు మృతి



దేవర ఎద్దు వద్ద నివాళులు అర్పిస్తున్న మహేశ్వరరెడ్డి, గ్రామస్థులు

చక్రాయపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చిలేకాంపల్లె గ్రామం వడ్డెపల్లెకు చెందిన దేవర ఎద్దు మృతి చెందింది. గత 30 సంవత్సరాలుగా పూజలు అందుకుంటున్న దేవర ఎద్దు చనిపోవడంతో గ్రామస్థులు కంటతడి పెట్టారు. మూడేళ్ల క్రితం ఇక్కడ దేవర కూడా జరిగింది. ఇటీవల పందిళ్లపల్లె గ్రామంలో, ఎరబాలపల్లెలో జరిగిన దేవరలో ఈ ఎద్దుకు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో దేవత లాంటి ఎద్దు చనిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదనకు గురయ్యారు. మండల టీడీపీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి, పెద్దమామిరెడ్డిగారి మామిరెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థలో పోలీసుల పాత్ర కీలకం

● జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు పాత్ర చాలా కీలకమైనదని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు హెడ్ కానిస్టేబుళ్లు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్లు, జిల్లా లీగల్ లైజన్ యూనిట్ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసులకు సంబంధించి అన్ని చట్టపరమైన చర్యలపై నిరంతర కృషి, సమన్వయం, పర్యవేక్షణ కోసం చట్టపరమైన అనుసంధాన విభాగం రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు సృష్టించబడిందన్నారు. ఇందులో విచారణలో కేసులు, బెయిల్ దరఖాస్తులు, అప్పీళ్లు, కోర్టు ప్రక్రియలు, ప్రాసిక్యూషన్‌కు సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ విభాగం జిల్లా ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణలో జిల్లా స్థాయిలో చట్టపరమైన కేంద్రంగా పనిచేస్తుందన్నారు. జిల్లాలో జరిగే అన్ని కోర్టుల్లోని కేసులు, వాటి వివరాలు సాయంత్రంలోపు జిల్లా పోలీసు కార్యాలయానికి చేరాలని, రోజులో సమన్లు, వారెంట్లు ఎన్ని తీసుకున్నారని, వాటి పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జడ్జిమెంట్ కాపీ వచ్చినప్పుడు వాటి అప్పీల్‌కు వెళ్లటకు కారణాలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిని అరెస్టు చేసినప్పుడు బెయిల్, రిమాండ్ వివరాల గురించి సంబంధిత అధికారులకు జిల్లా పోలీసు కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. న్యాయ వ్యవస్థలో మీరు పోషిస్తున్న పాత్ర అత్యంత కీలకమైనదని, కోర్టు కార్యాలాపాలు సజావుగా సాగడానికి, కోర్టుల గౌరవాన్ని నిలబెట్టడానికి మీ కృషి ప్రశంసనీయమన్నారు. కేసులకు సంబంధించిన రికార్డులను పటిష్ఠంగా నిర్వహించడం కీలకమని, దీనివల్ల విచారణ ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ తులసీరాం, డిస్ట్రిక్ లీగల్ లైజన్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణరెడ్డి, ఎస్ఐ రవికుమార్, కోర్టు పోలీసులు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు

సిద్దవటం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లె గ్రామ సమీపాన వెలసిన మందగిరి శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుబ్రమణ్యం శాస్త్రి మాట్లాడుతూ ఆరోగ్య సమస్య ఉద్యోగ వ్యాపారాల్లో ఇబ్బంది పడే వ్యక్తులు శనీశ్వరస్వామి మూల విరాట్ విగ్రహానికి ప్రత్యేక తైలాభిషేకం నిర్వహిస్తే కొన్ని సమస్యలు తొలగిపోతాయన్నారు. ఉమ్మడి కడప జిల్లా నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, చిన్నచౌకు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారని అర్చకులు తెలిపారు.

అఖండ భజనకు తరలిన కోడూరు భక్తులు

రైల్వేకోడూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుమల అఖండ భజనకు అదునుకోట నరసింహులు ఆధ్వర్యంలో కోడూరు భక్తులు శనివారం తిరుమలకు తరలి వెళ్లారు. ఆయన మాట్లాడుతూ తిరుమల నుంచి అఖండ భజనకు ఆహ్వానం రావడంతో మహిళలను తీసుకుని వెళుతున్నట్లు తెలిపారు. తిరుమలలో 13న అఖండ భజన కార్యక్రమం జరుగుతుందని, తిరుమలకు సోమవారమే తరలిపోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుముదా, రమ్య, లక్ష్మీ, మౌనిక, వేదా, గంగురాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండాలి

వీరబల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీలు పాదర్శకంగా ఉండాలని వెలుగు ఏపీఎం ఖాదర్‌వలి అన్నారు. శనివారం సోమవారం గ్రామ సమాఖ్య మహాసభ సమావేశం సోమవారం వడ్డెపల్లె ప్రాథమిక పాఠశాలలో జరిగింది. సభనుద్దేశించి ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులందరూ సంఘ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం నూతన నాయకత్వాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షురాలిగా రెడ్డెమ్మ, కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా రాధిక ఎంపికయ్యారు.

గణపతికి పూజలు

ఓబులవారిపల్లె, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మవరం గ్రామం వక్రతుండ మహాగణపతి దేవాలయంలో మండల పూజలు నిర్వహించినట్లు ఎన్ఆర్ఐ ఆలయ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. మే 11 నుంచి మూడు రోజుల పాటు వేదపండితుల నడుమ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేశారు. అనంతరం 40 రోజుల పాటు ప్రతిరోజు పూజాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం యజ్ఞాభిషేకాలు చేసి అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలు సంతోషం

రామాపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా ఉండాలని టీడీపీ మండల నాయకుడు సురేందర్‌రెడ్డి అన్నారు. చిట్లూరు, హసనాపురం గ్రామంలో శనివారం 48365 బూత్ లెవల్‌లో నియోజకవర్గ ఐటీడీపీ చాంపియన్ నాగభూషణ్ రెడ్డి, పార్టీ యూనిట్ ఇన్‌చార్జి సహదేవ రెడ్డి, భూత్ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో శనివారం గ్రామాల్లో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదర్శన్‌రెడ్డి, మానిటరింగ్ కమిటీ సభ్యుడు వెంకటరమణ, ఐటీడీపీ గణేశ్, యూనిట్ ఇన్‌చార్జి ఓబులేసు, బసిరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, గంగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి: సీపీఎం

రాయచోటిటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వ విధానాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు రవికుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దు

● ప్రజా దర్బార్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి

రాయచోటిటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలను ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిప్పుకోవద్దని జిల్లాలోని పలుశాఖల అధికారులకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి పలు సమస్యలపై అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన మంత్రి తక్షణమే అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించారు.

మార్గ నిర్దేశకులు గురువులు : మంత్రి

విద్యార్థులకు మార్గ నిర్దేశకులు గురువులని, ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ సేవలందించినప్పుడు అటువంటి వారికి అడగకుండానే అవార్డులు సొంతమవుతాయని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డీఈవో సుబ్రమణ్యంలు తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల ఓ కల్యాణ మండలంలో ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువుకు వందనం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కొంత మంది ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఉపాధ్యాయ సంఘం నేతలు నరసింహులు, మధుమతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీనివాసుని కల్యాణం



కల్యాణోత్సవంలో ఉత్సవ మూర్తులు

గాలివీడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శ్రవణా నక్షత్రం సందర్భంగా ఏర్పాటు చేసిన వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు కన్నుల పండుగగా సాగింది. ఈ కల్యాణానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య కల్యాణ మహోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు రంగనాయకులు మంత్ర పఠనం, వ్యాఖ్యానం భక్తులను ఆకట్టుకుంది. కల్యాణోత్సవంలో ఉత్సవ విగ్రహాలకు, స్వామివారి, అమ్మవారి మూల విరాట్ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. దేవాలయాన్ని పూలమాలలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

'జేఎల్ఎం గ్రేడ్-2లకు ప్రమోషన్ చానల్ ఇవ్వాలి'

సంబేపల్లె, జూలై 12(ఆంధ్రజ్యోతి): జేఎల్ఎం గ్రేడ్-2లకు ప్రమోషన్ చానల్ వెంటనే ఇవ్వాలని, నూతన సర్వీస్ రూల్స్‌ను రద్దు చేసి నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ ప్రకటించాలని అసోసియేషన్ 5 రాష్ట్రాల జాయింట్ సెక్రటరీ ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాయచోటి డివిజన్ ఆఫీసులో డీఈఈకి వినతిపత్రం అందజేశారు. పై స్థాయి అధికారులు సానుకూలంగా స్పందించని పక్షంలో ఈ నెల 21న విజయవాడలో భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ శంకర్, అసోసియేషన్ సభ్యులు రెడ్డిరాజు, దర్బార్, మహేశ్, మహమ్మద్, రూపేశ్‌నాయక్ పాల్గొన్నారు.

కష్టపడిన వారికే పార్టీ పదవులు ఇవ్వాలి

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌తో కస్తూరి బృందం భేటీ



పల్లా శ్రీనివాసయాదవ్‌తో కస్తూరి తదితరులు

రైల్వేకోడూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడిన వారికే పార్టీలో పదవులు ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. శనివారం విజయవాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరంతరాయంగా పని చేస్తున్న కార్యకర్తలకు, నాయకులకు పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఎవరైతే పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నారో, పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని తూచా తప్పకుండా పని చేశారో వారికే పదవులు ఇవ్వాలని తెలిపారు. రైల్వేకోడూరుపై దృష్టి పెట్టాలని, పార్టీని నమ్ముకున్న వారికి న్యాయం చేయాలని కోరారు. పార్టీ అధ్యక్షుడు స్పందిస్తూ నియోజకవర్గ కమిటీలను సీఎం చంద్రబాబునాయుడుతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ భేటీలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ పాల్గొన్నారు.

పాలేగార్ వారసత్వ హక్కులు గుర్తించాలి

- ఏపీ పాలేగార్ల వారసుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు

సుండుపల్లె, జూలై 12(ఆంధ్రజ్యోతి): పూర్వపు పాలేగార్ల వంశీయులకు బ్రిటీష్ ప్రభుత్వం కల్పించిన వారసత్వపు హక్కులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని ఏపీ పాలేగార్ల వారసుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏనుగొండ కేశవులనాయుడు కోరారు. శనివారం మండలంలోని ఎర్రమనేనిపాలెం గ్రామంలో నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. పూర్వపు కాకతీయ రాజుల కాలంలో పరిపాలన సౌలభ్యం కోసం పాలేగార్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అనంతరం ఎర్రమనేనిపాలెం చరిత్రకు సంబంధించి ముఖ చిత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పరిశోధకులు తవ్వా ఓబుల్‌రెడ్డి, పాలేగార్ల సంఘం ప్రధాన కార్యదర్శి జానకీ, చంద్రప్పనాయుడు, పార్థసారధినాయుడు, రామచంద్రప్పనాయుడు, రాంగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాక అభివృద్ధి పనులపై పరిశీలన



రాజంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా శనివారం టీటీడీ ఆర్అండ్‌బీ ఎస్ఈ మనోహర్, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకటరత్నయ్య తదితర టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు తాళ్లపాక గ్రామంలోని ధ్యాన మందిరాన్ని పరిశీలించారు. ప్రధానంగా గ్రామంలో సమస్యలపై ఇటీవల గ్రామస్థులు, బీజేపీ నాయకులు రమేష్‌నాయుడు, ఉద్దండం సుబ్రమణ్యం తదితరులు కలిసి టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌తో కలిసి ఈవో శ్యామలరావుకు వివరించారు. ఇందుకు స్పందించిన ఈవో ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలో టీటీడీ పాలకమండలికి, ఈవోకు తాళ్లపాకలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల నివేదికను సమర్పించి వారి ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రమేష్‌నాయుడు, నాగోతు రమేష్‌నాయుడు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు తగదు

● రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు

ఓబులవారిపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులపై ప్రభుత్వంపై బురదజల్లే ఉద్దేశ్యంతో తప్పుడు ప్రచారాలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు గునిపాటి చెన్నరాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఎండీసీ నుంచి టెండరు దక్కించుకున్న ఎంప్రదా కంపెనీకి ముగ్గురాయి లోడింగ్ కాంట్రాక్టు వైసీపీకి చెందిన అంజని మినరల్ కంపెనీ ద్వారా దాదాపు ఆరు నెలల నుంచి పనిచేస్తున్నదని తెలిపారు. అయితే మంగంపేట వాసులకు, టీడీపీ కార్యకర్తలకు, స్థానికులకు ఉపాధి కల్పించాలని ఉద్దేశ్యంతో 25 శాతం లోడింగ్ కాంట్రాక్టును మధ్యవర్తిత్వం ద్వారా పొందినట్లు పేర్కొన్నారు. కానీ వైసీపీ మైండ్ గేమ్ ఆడుతోందని విమర్శించారు. టీడీపీ సీనియర్ నాయకుడు గునిపాటి చెన్నరాయుడు పత్రికా ముఖంగా తెలిపారు.

కూటమి ఏడాది పాలనలో చేసిందేమీ లేదు : వైసీపీ

రాయచోటిటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలన మోసాల మయంగా మారిందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో గల వైసీపీ కార్యాలయంలో రాయచోటి మున్సిపాలిటీ వైసీపీ కమిటీలు, అనుబంధాల విభాగాలు, కౌన్సిలర్లు నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, పట్టణ అధ్యక్షుడు నవాజ్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు.

అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలి

● రాజంపేట మున్సిపల్ టీడీపీ పరిశీలకుడు కొమ్మా శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పరిశీలకుడు

రాజంపేట/రాజంపేటటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఆయా ప్రాంత టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని రాజంపేట మున్సిపల్ టీడీపీ పరిశీలకుడు కొమ్మా శివకుమార్ పేర్కొన్నారు. శనివారం రాజంపేట పట్టణం 13, 21 వార్డుల టీడీపీ ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్లు గుగ్గిళ్ల చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన వార్డు కమిటీ ఎన్నికల సమావేశానికి శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 21 వార్డు అధ్యక్షుడిగా కోనేటి వెంకటరమణ, 13వ వార్డు అధ్యక్షుడిగా బాలాజిలను ఏకగ్రీవంగా ఎన్నుకొంటున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, గీతాంజలి రమణ, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబూబకర్ తదితరులు పల్గొన్నారు.

సుపరిపాలన తొలి అడుగు

రాజంపేట మండలం వెంకటరాజంపేట, పోలి గ్రామాల్లో శనివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రానికి రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి కేవీ రమణ, గ్రామ కమిటీ అధ్యక్షులు, పసుపులేటి పెంచలయ్య, తెలుగు యువత, అధికార ప్రతినిధి, సింగన పరశురాం, చుండు సుధీర్, నవీన్, హరి, మహిళలు పాల్గొన్నారు.

రాయచోటి డిపో అభివృద్ధికి కృషి

● ఇన్‌చార్జి డిపో మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డిపో మేనేజర్

రాయచోటిటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సమస్యలు లేని రాయచోటి డిపోను మరింత అభివృద్ధికి కృషి చేస్తామని ఇన్‌చార్జి డిపో మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన రాయచోటి ఇన్‌చార్జి డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. రాయచోటి డిపో పరిధిలో ఉన్న బస్సు సర్వీసులను ప్రజల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వీసులను నడుపుతున్నామన్నారు. సుదీర్ఘ ప్రయాణ బస్సు సర్వీసులను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. రాయచోటి డిపోలో ఉన్న మౌలిక సదుపాయాలు, సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేశామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

● ఎస్ఐ మహమ్మద్‌రఫీ



బండి కనుమ సమీపాన వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

సిద్దవటం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ మహమ్మద్ రఫి అన్నారు. కడప-మాచుపల్లె రహదారి బండి కనుమ సమీపాన శనివారం వాహనాల తనిఖీల్లో భాగంగా ఎస్ఐ మాట్లాడుతూ మాచుపల్లె, డేగనవారిపల్లె, లింగంపల్లె, తురకపల్లె సమీప ప్రాంతాల్లో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని, ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు తమ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామన్నార. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రమణ, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యం ముద్దు: పీహెచ్‌సీ డాక్టర్

సిద్దవటం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని మాధవరం ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి శివకుమార్ తెలిపారు. మాధవరం-1, ఎస్‌కేఆర్ నగర్ గ్రామాల్లోని జీవీఎస్, ఓరియంట్ జడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించిన 104 వైద్యశిబిరంలో మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో వైద్యసేవలు పొందాలని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిని శ్రీవిద్య, ఆరోగ్య కార్యకర్త రాజరాజేశ్వరి సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఏర్పాటు



నూతన పంచాయతీ కార్యదర్శుల సంఘం

రాయచోటిటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో హోంలో శనివారం జరిగిన జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికకు జిల్లాలోని అన్ని మండలాల పంచాయతీ కార్యదర్శులు హాజరై సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాంమోహన్, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్‌నాయక్, గౌరవాధ్యక్షుడు సిగ్బతుల్లా, జనరల్ సెక్రటరీలుగా నరసింహులు, రజనీస్‌రెడ్డి, కోశాధికారిగా సంజీవ రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పవన్‌కుమార్, లీగల్ సెల్ కార్యదర్శిగా మల్లికార్జునరెడ్డి, జాయింగ్ సెక్రటరీలుగా శేషగిరి, వెంకట్రమణ, మహేశ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు మాట్లాడారు.

తాళ్లపాకలో ఘనంగా రథోత్సవం



గ్రామోత్సవంలో స్వామివారు

రాజంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాక గ్రామంలో చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెన్నకేశవ, సిద్దేశ్వర స్వాముల ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని కర్పూర హారతులు సమర్పించి మొక్కుకున్నారు. టీటీడీ కళాకారులు మంగళ వాయిద్యాలు, డప్‌లు, భజనలు చేసి అందరిని అలరించారు.

'సౌమ్యనాథాలయం.. వెయ్యేళ్ల ప్రాభవం'

నందలూరు, జూలై 12: (ఆంధ్రజ్యోతి): పవిత్ర బాహుదానది తీరాన నందలూరు క్షేత్రంగా వెలసిన సౌమ్యనాథస్వామి దేవాలయం వెయ్యేళ్ల చరిత్రకు ప్రాభావానికి నిలువుటద్దంగా నిలిచిందని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ పేర్కొన్నారు. ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఆయన సౌమ్యనాథ ఆలయ స్థల పురాణం రథోత్సవం విశిష్టత అనే అంశంపై ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రామాలయంలో అభిషేకం, పూజలు

సుండుపల్లె, జూలై 12(ఆంధ్రజ్యోతి): సీతారాములకు అభిషేకం, పూజలు నిర్వహించినట్లు కందువాండ్లపల్లె గ్రామస్థులు తెలిపారు. మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ కందులవాండ్లపల్లెలో నిర్మించిన రామాలయంలో శనివారం ఉదయం సీతారామ, లక్ష్మణులు, ఆంజనేయస్వాములకు పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.


టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

సిద్దవటం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో టీడీపీ కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ ఆత్మస్థైర్యాన్ని నింపే ఏకైక పార్టీ టీడీపీ అని గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుడు శ్రీరామదాసు తెలిపారు. మండలంలోని మాధవరం-1, ఎస్‌కేఆర్ నగర్ గ్రామంలో శనివారం టీడీపీ క్రియాశీలక సభ్యత్వ గుర్తింపు కార్డులు పంపిణీ చేపట్టారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర మంత్రులుఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, బీసీసీఐ స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్ అంకిత్ కలియార్, సినీ హీరో సంతోష్ శోభన్, నటుడు అశోక్ బాబు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఆనం రామనారాయణరెడ్డి - కొల్లు రవీంద్ర - సంతోష్ శోభన్ - అశోక్‌బాబు

అతి త్వరలో వంద భాషల్లో శ్రీమద్ భగవద్గీత

● గాయకుడు గజల్ శ్రీనివాస్



తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): శ్రీమద్ భగవద్గీతను అతి త్వరలో నూరు భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏడాదిగా శ్రీమద్ భగవద్గీతను నూరు భాషల్లో చేయాలనే యజ్ఞంలో కృషి చేస్తున్నామన్నారు. తెలుగు, సంస్కృతంలో తాను పాడిన భగవద్గీతను తిరుపతిలో విడుదల చేసి స్వామికి అంకితం చేస్తామన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.84 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 70,217

తలనీలాలు సమర్పించినవారు: 31,155



ప్రీ-నేషనల్స్‌కు జిల్లా షూటర్స్ ఎంపిక



ప్రీ-నేషనల్స్‌కు ఎంపికైన జిల్లా షూటర్స్

తిరుపతి(క్రీడలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఎన్టీఆర్ కేవీకే 10మీటర్ల ఎయిర్ రైఫిల్/పిస్టల్ షూటింగ్ కేంద్రంలో శిక్షణ పొందిన పదిమంది షూటర్లు ప్రీ-నేషనల్స్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రేంజ్‌లో ఇటీవల హైదరాబాదు గచ్చిబౌలిలో రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 11మంది ప్రాతినిధ్యం వహించారు. ఇందులో లవకుమార్, సాయిఅచ్యుత్‌రాయల్, హేమచంద్, పురుషోత్తం, భార్గవి, హస్విత, యోక్షిత, నందగోపాల్, హితేష్, వైష్ణవీలు నేషనల్స్‌కు ఎంపికయ్యారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ కేవీకేలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.దేవరాజ్, డీఎస్‌డీవో శశిధర్ ఆధ్వర్యంలో క్రీడాకారులను సన్మానించి, అభినందించారు. సంఘం ఉపాధ్యక్షుడు సిద్ధయ్య, కార్యదర్శి డాక్టర్ భానుప్రకాష్, జయరాజ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



గ్రాప్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మాణిక్యాలు

తిరుపతి(క్రీడలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య కూడలి సమీపంలోని గిరిజన భవన్‌లో శనివారం సాయంత్రం 5వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఏపీ క్రీడా భారతి అధ్యక్షుడు ఎం.వి.మాణిక్యాలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. సబ్ జూనియర్, క్యాడెట్(బాలబాలికలు) విభాగాల్లో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన అథ్లెట్లను ఆయన పరిచయం చేసుకున్నారు. క్రీడల ద్వారా యువతలో శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ క్రీడా భారతి కార్యదర్శి ధనంజయరెడ్డి, సంయుక్త కార్యదర్శి సురేంద్ర రెడ్డి, డీఎస్‌డీవో ఎన్.శశిధర్, ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు రేఖారాణి పాల్గొన్నారు.

చంద్రగిరిలో మ్యాట్రిక్ థర్మల్ 4 డ్రోన్‌తో నైట్ బీట్

● చిమ్మచీకట్లో ఆటోలో మద్యం తాగిన నలుగురి గుర్తింపు



యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

చంద్రగిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తొండవాడ, బీడీ కాలనీ, జడ్పీ హైస్కూల్ ప్రాంతంలో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి మ్యాట్రిక్ థర్మల్ 4 డ్రోన్ కెమెరాతో నైట్ బీట్ నిర్వహించారు. తొండవాడ జాతీయ రహదారి సమీపంలోని చెట్ల పొదల్లో చీకట్లో ఓ ఆటోలో నలుగురు వ్యక్తులు మద్యం తాగుతున్న దృశ్యాలు ఇందులో రికార్డు అయ్యాయి. వెంటనే డ్రోన్ టీమ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రి 8 గంటల తర్వాత పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం ఉంటుందన్న విషయాన్ని గుర్తు చేశారు.

హిందూ ఆలయాల యువచైతన్య మహాపాదయాత్ర ప్రారంభం



ఎర్రావారిపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) హిందూ దేవాలయాల యువచైతన్య మహాపాదయాత్రను శ్రీభువనగిరి పీఠాధిపతి కమలానంద భారతి ఆధ్వర్యంలో శనివారం తలకోన నుంచి ప్రారంభమైంది. 8నెలల పాటు సాగే పాదయాత్ర గురించి ఆయన మాట్లాడుతూ 'భగవద్భక్తి-కర్తవ్యదీక్ష-సమాజశక్తి' నినాదంతో తలకోన నుంచి సాధుసంపత్‌లు యాత్ర సంకల్పించారని చెప్పారు. సనాతన హైందవ ధర్మపరిరక్షణ, దేవాలయాలు, సంస్కృతాంధ్ర భాషా పరిరక్షణ, హిందూ యువ చైతన్యం లక్ష్యాలతో యాత్ర కొనసాగుతుందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి, కర్నూలు, అనంతపురం, నారాయణపేట, గద్వాల్, వనపర్తి, నంద్యాల, కడప, నెల్లూరు జిల్లాల్లో 6 నెలల్లో 8 వేల గ్రామాల్లో పాదయాత్ర జరుగుతుందని వివరించారు. ఫిబ్రవరిలో తిరుపతిలో ధార్మిక మహాసమావేశంతో ముగియనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రాఘవులు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, టీడీపీ నాయకులు నన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు హేమంబరధర నాయుడు, తలకోన ట్రస్ట్ చైర్మన్ సోమనాథరెడ్డి, ఈవో రవీంద్రరాజు, టీడీపీ మండల నాయకులు గోపి, కేశవుల నాయుడు పాల్గొన్నారు.

గజరాజుల కట్టడికి యాక్షన్‌ప్లాన్



● దక్షిణాది రాష్ట్రాల సమాలోచనలు ● నోడల్ కమిటీకి నివేదిక అందజేసిన సబ్ కమిటీ

మంగళం, జూలై 12(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగుల దాడులు పెద్దసమస్యగా మారింది. ఈ క్రమంలో 2024 డిసెంబరు 18న తమిళనాడు మాజీ పీసీసీఎఫ్ సంజయ్ కె శ్రీనివాస్ చైర్మన్‌గా ఆరుగురితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సబ్ కమిటీ తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో ఏనుగుల సంతతి, వాటి కదలికలు, ప్రజల ఆస్తులు, ప్రాణాలకు నష్టం కలగకుండా ఎలా కట్టడి చేయాలి అనే దానిపై యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. పూర్తి స్థాయిలో పరిశీలించి, నివేదికను నోడల్ కమిటీకి అందజేసింది.

ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల పరిశీలన

దక్షిణాది రాష్ట్రాల సంయుక్త ఆధ్వర్యంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో ఏర్పడిన నోడల్ కమిటీ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏనుగులు ప్రవేశించే, అవి తిరిగి వెళ్లే మార్గాలను రెండు రోజుల క్రితం పరిశీలించింది. ఏనుగులు ఎక్కువగా సంచరిస్తున్న పలమనేరు, తలకోన, కల్లూరు, భీమవరం, బాలపల్లి, మామండూరు, తిరుమల నడక మార్గంలోని ఏడవ మైలును సందర్శించింది. శేషాచల కొండల్లోకి వస్తున్న ఏనుగులు సమీప భాకరాపేట, కల్లూరు, మామండూరు, బాలపల్లి, భీమవరం తదితర ప్రాంతాల్లో పంటలపై దాడి చేస్తున్న విషయాలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. అనేక సందర్భాల్లో రైతుల ప్రాణాలను కూడా బలి తీసుకున్నట్లు ఆయా ప్రాంతాల వారు కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోనూ ఈ కమిటీ పర్యటిస్తోంది. కేరళ నుంచి తమిళనాడు, కర్ణాటక మీదుగా ఆంధ్ర రాష్ట్రంలోకి ఏనుగుల మంద ఎప్పుడు వచ్చింది.. అందులో ఎన్ని ఏనుగులు ఉన్నాయి.. అవి ప్రయాణించే మార్గం, ఎక్కడెక్కడ ఎంతకాలం ఉంటున్నాయి.. ఆ సమయంలో జరుగుతున్న ఆస్తి, ప్రాణ నష్టాల గురించి తెలుసుకుంటున్నారు. ఆ తర్వాత వీటిని నిలువరించడానికి గల అవకాశాలను పరిశీలిస్తారు. అదే సమయంలో అవసరమైన ఆహారం, నీరు పుష్కలంగా లభించే ప్రాంతాలను గుర్తిస్తారు. వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపైనా కసరత్తు చేస్తున్నారు. వీటన్నింటిపై పూర్తి స్థాయిలో నివేదిక రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తారు. కమిటీ తీసుకున్న నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయగలిగితే మేలు జరిగే అవకాశముంటుందని రైతులు భావిస్తున్నారు.

ఏనుగులు తిరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న నోడల్ కమిటీ సభ్యులు




ఘనంగా వేద విశ్వవిద్యాలయ వార్షికోత్సవం

● సుదర్శన సహిత పారమాత్మిక హోమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ 20వ వార్షికోత్సవం అత్యంత వేడుకగా సాగింది. ఉదయం సుదర్శన సహిత పారమాత్మిక హోమం చేపట్టారు. అనంతరం నిర్వహించిన సభలో వీసీ ప్రొఫెసర్ రాణిసదాశివమూర్తి, రిజిస్ట్రార్ భాస్కరుడు పాల్గొని మాట్లాడారు. టీటీడీ సహకారంతో రెండు దశాబ్దాలుగా వేద విజ్ఞాన వ్యాప్తిలో వేద యూనివర్సిటీ ఎంతో కృషి చేసిందన్నారు. ఎంతో మంది వేద పండితులను తీర్చిదిద్దిందని తెలిపారు. వేద విజ్ఞానంపై విలువైన పరిశోధనలు సాగాయన్నారు. అనేక విలువైన వేద సంబంధ గ్రంథాలు ప్రచురించినట్టు చెప్పారు. అనేక మంది వేద పండితులు యూనివర్సిటీని సందర్శించారని తెలిపారు. వేద సంబంధ విషయాలపై సదస్సులు, వర్క్‌షాప్‌లు చేపట్టినట్టు వివరించారు. వేద, ఆగమ, పౌరోహిత్య, వేదాంగ, వేద భాష్యాలపై విస్తృత అధ్యయనం సాగుతున్నట్టు వివరించారు. శ్రీవారి అనుగ్రహం, టీటీడీ అధ్యక్షులు, ఈవోల సహకారంతో ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు. విద్యార్థులకు వస్త్రాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేద విశ్వవిద్యాలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

వార్షికోత్సవ వేళ రాజకీయ వివాదం!

● హాజరుకాని బీజేపీ, టీడీపీ నాయకులు

వేద విశ్వవిద్యాలయ వార్షికోత్సవ వేళ రాజకీయ వివాదం రేగింది. టీటీడీ సహకారంతో నిర్వహిస్తున్న వేద విశ్వవిద్యాలయం వార్షికోత్సవానికి టీటీడీ చైర్మన్‌ను, ఈవోను, యూనివర్సిటీ అధికారులను ఆహ్వానించలేదనే ఆరోపణలు వినిపించాయి. దీనికి కారణాలు ఏమిటనే విషయాన్ని పక్కనపెడితే స్థానిక బీజేపీ, టీడీపీ నేతలను మచ్చిక చేసుకోవడానికి వేద వర్సిటీ ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారనే విమర్శ తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో పలు అధికారిక హోదాల్లో ఉన్న స్థానిక బీజేపీ, టీడీపీ నాయకులను వార్షికోత్సవానికి ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికలోనూ వారి పేర్లను ముద్రించారు. అయితే తుదకు వారు కార్యక్రమానికి హాజరుకాలేదు. ఇలాంటి పరిస్థితుల మధ్య వేద వర్సిటీ వార్షికోత్సవం సాగింది. ఈ వివాదం ఎక్కడికి దారి తీస్తుందనేది ఆసక్తిగా మారింది.

విమానాశ్రయ ప్రైవేటీకరణను ఆపండి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్



నిరసన తెలుపుతున్న చింతామోహన్

రేణిగుంట, జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రైవేటీకరణ చేయరాదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. చింతామోహన్ మాట్లాడుతూ తిరుపతి విమానాశ్రయాన్ని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా అంతర్జాతీయ స్థాయికి పునాది వేశారని గుర్తు చేశారు. రాయలసీమలో ఇది ఒకే ఒక అంతర్జాతీయ విమానాశ్రయమని తెలిపారు. దీన్ని అదానీకి అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం ఫైలు సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రావణ, వడివేలు, మురళి, సురేష్ ,శివ, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీపై బండి వ్యాఖ్యలు ఆక్షేపణీయం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), జూలై 12(ఆంధ్రజ్యోతి): టీటీడీ గురించి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆక్షేపిస్తున్నామని వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఒక ప్రకటనను శనివారం వీడియో ద్వారా విడుదల చేశారు. టీటీడీలో వెయ్యిమందికి పైగా అన్యమత ఉద్యోగులు ఉన్నారని బండి సంజయ్ చెప్పడం సరికాదని, వారిని తొలగించాలంటూ హెచ్చరించడాన్ని తప్పుబట్టారు. ఈ వ్యాఖ్యలు శ్రీవారి ఆలయంపై దాడిలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల వెనుక కుట్ర దాగి ఉందన్న అనుమానం కలుగుతోందని తెలిపారు. టీటీడీని ప్రక్షాళన చేస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం బండి వ్యాఖ్యలను సమర్థించడం సరికాదని పేరొన్నారు.

తిరుమలలో సర్వే చేసి అన్యమతస్థులుంటే తొలగిద్దాం

● భూమనకు భానుప్రకాష్‌రెడ్డి సవాల్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 12(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలో ఇంటింటి సర్వే చేద్దాం... ఎవరి ఇళ్లలోనైనా అన్య దేవుళ్ల సాహిత్యం, చిత్రపటాలు కనిపించినా ఆ ఉద్యోగులను టీటీడీ ఉద్యోగాల నుంచి తొలగిద్దాం... మీరు సహకరిస్తారా' అని మాజీ ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆ మేరకు ఆయన శనివారం ఓ వీడియో విడుదల చేశారు. టీటీడీలో వెయ్యిమంది అన్యమతస్తులు ఉన్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల మెనుక కుట్ర దాగి ఉందని భూమన పేర్కొనడాన్ని భానుప్రకాష్‌రెడ్డి ఖండించారు. '2019 నుంచి 2024 వరకు హిందూ వ్యతిరేక ప్రభుత్వం రాజ్యమేలింది. ఓ నాస్తికుడు టీటీడీ చైర్మన్‌గా వ్యవహరించారు. హిందూ ఆలయాలు, పవిత్ర రథాలపై దాడులు జరిగాయి. టీటీడీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా భారీ అవినీతికి పాల్పడ్డారు' అంటూ ధ్వజమెత్తారు. తిరుమలలో కొందరు పేరుకు రాముడు, కృష్ణుడుగా ఉన్నారు గాని వారి ఇళ్లలో మాత్రం ఏసు చిత్రపటాలు ఉంటున్నాయన్నారు. కరుణాకరరెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇంటింటి సర్వేకు అంగీకరించి తమకు సహకరించాలని కోరారు.

క్రీడల్లో పతకాలు సాధించిన టీటీడీ వీఎస్వోలకు అభినందన



తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): ఇటీవల అమెరికాలో జరిగిన ప్రపంచ పోలీసు క్రీడల్లో బంగారు, కాంస్య పతకాలను సాధించిన టీటీడీ విజిలెన్స్ వీఎస్వోలను టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం అభినందించారు. తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పతకాలను చూపించారు. టీటీడీ ప్రతిష్టను మరింత పెంచేలా విజయం సాధించినందుకు వారిని చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు.

జీవన మార్గాన్ని ఉపదేశించిన శ్రీమద్భగవద్గీత గజల్ గానం

● గజల్ గానంతో ఆహూతులను మంత్రముగ్ధులను చేసిన గజల్ శ్రీనివాస్



గజల్స్ గానం చేస్తున్న గజల్ శ్రీనివాస్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, నైతిక జీవన మార్గాన్ని ఉపదేశించేలా శ్రీమద్భగవద్గీత సారాన్ని ప్రఖ్యాత గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ తన స్వరంలో ఒలికించారు. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో 'శ్రీమద్భగవద్గీత' గజల్ గానం నిర్వహించారు. భగవద్గీతలోని శ్లోకాలను రాగయుక్తంగా ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఎంతో సాంస్కృతిక వైభవం గల తిరుపతిలో ఇటువంటి కార్యక్రమాన్ని మరింత సాంస్కృతిక శోభను తెస్తాయని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని కోరారు. టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ తిరుపతిలో జీవించడమే గొప్ప అదృష్టమన్నారు. పవిత్రమైన తిరుపతిలో ఇటువంటి కార్యక్రమాలు మరింత మంచి వాతావరణాన్ని కలుగ చేస్తాయన్నారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తిరుపతి కేంద్రంగా అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉందన్నారు. ఈ క్రమంలో భగవద్గీతను గజల్ శ్రీనివాస్ నోట వినడం గొప్పగా ఉందన్నారు. గజల్ శ్రీనివాస్ ఆలపించిన గజల్ ఆడియో పెన్‌డ్రైవ్‌ను ఆవిష్కరించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దుబాల బృందం ప్రదర్శించిన అష్టలక్ష్మీ వైభవం అత్యద్భుతంగా సాగింది. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్, ఉమా ముద్దుబాల, ఇతర అతిథులను అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గౌరవ కార్యదర్శి పాండ్ర సురేంద్ర నాయుడు సత్కరించారు. సభను ఆకెళ్ల విభీషణశర్మ సమన్వయం చేశారు. పలువురు కళాకారులు, కళాభిమానులు, నగర వాసులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మీ వైభవం నృత్య రూపకంలో ఉమా ముద్దుబాల బృందం

తిరుపతిలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

● పార్కింగ్ నిబంధనలపై ప్రైవేటు వాహనాల యజమానులకు సూచనలు

● అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక

తిరుపతి(నేరవిభాగం), జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు భక్తవత్సలం, రామకృష్ణమాచారి, సీఐలు, రిజర్వు బలగాలు, ఎస్టీఎఫ్ ఫోర్సుతో కలిసి నగరంలోని 10 ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పూర్ణకుంభం సర్కిల్ నుంచి భారతి బస్టాండు వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. ప్రైవేటు బస్సులు రోడ్డుపై ఇష్టమొచ్చినట్లు పెట్టడంతో అసహనం వ్యక్తం చేశారు. పద్ధతిలో పెట్టుకునే విధంగా చూడాలని ఆదేశించారు. అక్కడి నుంచి ట్రావెల్స్ ఆఫీసుల వద్దకు వెళ్లి మేనేజర్లను పిలిపించి బస్సులను ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా పెట్టవద్దని సూచించారు. అక్కడే నడి రోడ్డుపై ఆపి ఉన్న ఆటోను పరిశీలించి ట్రాఫిక్ సీఐను పిలిచి జరిమానా వేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఆటోలను పరిశీలించారు. ఆటోలకు డిజిటల్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ రామకృష్ణమాచారిని ఆదేశించారు. బస్టాండులో కొందరు ప్రయాణికులతో ముచ్చటించారు.



ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిమ్మినాయుడుపాలెంలో సమస్యలపై ఆరా

తిమ్మినాయుడుపాళానికి వెళ్లిన ఎస్పీ స్థానికులతో ముచ్చటిస్తూ పోలీసు శాఖ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఆకతాయిల ఆగడాలు, పోలీసులు రాత్రి గస్తీలపై అడిగి తెలుసుకున్నారు. డ్రోన్‌లతో మందుబాబులు, యువత, రౌడీలు, ఆకతాయిలు భయపడుతున్నారని, ఊరు ప్రశాంతంగా ఉందని స్థానికులు వివరించారు. అవిలాల, చంద్రగిరి, జీవకోన, ఎస్టీవీనగర్, మంగళం, తిరుచానూరు ప్రాంతాల్లో తనిఖీలు చేసి ప్రజలకు భరోసా కల్పించారు. దాదాపు రెండు గంటల పాటు తనిఖీలు చేశారు.

జైలు పక్షులే దోపిడీ చేశారు

- నిత్యానందరెడ్డి ఇంట్లో చొరబడింది పాత నేరగాళ్లు
- ఒకరిని అరెస్టు చేసిన పోలీసులు
- 20 తులాల బంగారం, కారు, బైకు స్వాధీనం
- ఉత్తరాది ముఠా కోసం గాలింపు
- హిందూపురం డీఎస్పీ మహేష్

హిందూపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): పాత కేసుల్లో కర్ణాటక పోలీసు లకు పట్టుబడిన ఉత్తరాది ముఠాతో అన్నమయ్య జిల్లాకు చెందిన పాత నేరస్తుడికి పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతోనే గత నెల 26న హిందూపురం మండలం కిరికెర పంచాయతీ వెంకటాద్రి లే అవుట్‌లో దోపిడీ చేశారు. నిత్యానందరెడ్డి ఇంట్లోకి చొరబడి, కత్తులు, తుపాకీ బెది రించి హల్‌చల్ చేశారు. ఎవరినో చంపేందుకు వచ్చి, పొరపాటున ఆ ఇంట్లో దూరినట్లు మాట్లాడుకుని, బురిడీ కొట్టించాలని చూశారు. కానీ పోలీసులకు చిక్కిపోయారు. హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు వివరాలను డీఎస్పీ మహేష్ విలేకరులకు శనివారం వివరిం చారు. మదనపల్లి తాలూకా చిన్నతిప్పసముద్రం గ్రామానికి చెందిన షేక్ ఖాజాపీర్ ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. వ్యసనాలకు బానిసై, డబ్బుల కోసం కర్ణాటక, ఏపీలోని పలుచోట్ల దొంగతనాలు చేశారు. ఇతనిపై ఇప్పటికే తొమ్మిది కేసులు ఉన్నాయి. కర్ణాటకలో నమోదైన ఓ కేసులో అక్కడి పోలీసులు అరెస్టు చేసి, చిక్కబ ళ్లాపుర



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, పట్టుబడిన నిందితుడితో డీఎస్పీ, సీఐలు

సబ్‌జైలులో ఉంచారు. అక్కడే ఉత్తరాది ముఠాతో ఖాజాపీర్‌కు పరిచయం ఏర్పడింది. వీరందరూ ఈ ఏడాది ఫిబ్రవరిలో జైలు నుంచి బయటకు వచ్చారు. కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేశారు. గత నెల 26న హిందూపురం మండలం వెంకటాద్రి లే అవుట్‌లో నిత్యానందరెడ్డి ఇంట్లోకి చొరబడ్డారు. అందరినీ బంధించి, బంగారు ఆభరణాలను దోచుకున్నారు. తాము ఎవరినో చంపడానికి వచ్చామని, ఎమ్మెల్యే కొడుకు అడ్రస్ సరిగా ఇవ్వలేదని మాట్లాడుకున్నారు. ఇదంతా ఉత్తిదేనని పోలీసులు తేల్చారు. కేసు దర్యాప్తు కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని డీఎస్పీ తెలిపారు. హిందూపురం ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఖాజాపీర్ శనివారం పట్టుబడ్డాడని తెలిపారు. ఇతన్నుంచి 201 గ్రాముల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలి పారు. ఇందులో చిలమత్తూరు పోలీస్‌స్టేషన్, హిందూపురం వన్‌టౌన్, టూటౌన్, హోస్పేట, అర్సిగెరె ప్రాంతాలలో చోరీ చేసిన బంగారం ఉందని తెలిపారు. నిత్యానందరెడ్డి ఇంట్లో 12 తులాల బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారని, ఇందులో ఉత్తరాది ముఠా 7 తులాలను తీసుకెళ్లిందని తెలిపారు. మిగిలిన ఐదు తులాల ఆభరణాలు, నేరానికి వినియోగించిన ఐ-20 కారు, ఒక ద్విచక్రవాహనాన్ని ఖాజాపీర్ నుంచి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దోపిడీలో ఐదుగురు పాల్గొన్నారని, మిగిలిన నలుగురి కోసం గాలిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐలు ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం, ఎస్‌ఐలు నరేంద్ర, మునీర్ అహ్మద్‌ను డీఎస్పీ అభినందించారు.

టిప్పర్ ఢీ.. ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- సంతకు వెళుతుండగా ప్రమాదం



బాల నాగయ్య మృతదేహం, టిప్పర్ ఢీకొన్న చోట ప్రమాద దృశ్యం

దువ్వూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మేకపిల్లను విక్రయించేందుకు సంతకు వెళుతుండగా టిప్పర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దువ్వూరు మండలం క్రీస్తురాజపురం నాలుగు రోడ్ల వద్ద జరిగింది. ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.... రాజుపాళెం మండలం వెలువలి గ్రామానికి చెందిన బాలనాగయ్య (42), హుసేనయ్య (60) శనివారం ఉదయం బైకుపై మేకపిల్లను తీసుకుని మైదుకూరు సంతకు బయల్దేరారు. దువ్వూరు సమీపంలోని క్రీస్తు రాజపురం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా బాలనాగయ్య ప్రాణాలు కోల్పోయాడు. హుసేనయ్య చికిత్స పొందుతున్నా రు. ఈ మేరకు కేసు నమోదు అయిందని టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ వివరించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ఓబులవారిపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారిలో చిన్నఓరంపాడు వద్ద కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. చెన్నూరుకు చెందిన సోమశిల శ్రీనివాసులు (50) తమలపాకు తోటల్లో పనులు చేస్తూ ఉండేవారు. హోటల్‌కు మధ్యాహ్నం భోజనానికి టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై వెళుతుండగా హైదరాబాద్ నుంచి తిరుమల వెళుతున్న ఇన్నోవా వాహనం ఢీకొనడంతో కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆవు దాడిలో మహిళ...

లక్కిరెడ్డిపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆవు దాడి చే యడంతో సుజాతమ్మ (45) అనే మహిళ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుజాతమ్మ జెర్సీ ఆవుల పోషణతో జీవించేది. శనివారం ఉదయం ఆవులను మేపుకోసం వదిలి కాపలా కాస్తుండగా, అదే ప్రాంతంలో మేస్తున్న మరో ఆవు ఆమెపై దాడి చేసి కొమ్ములతో పొడిచింది విషయం గమనించిన పశువుల కాపరులు ఆమెను రాయచోటిలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతిని తీసుకెళ్లారని మహిళపై దాడి

మదనపల్లె అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో యువకుడి తల్లిపై యువతి బంధువులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బి.కొత్తకోటకు చెందిన భావన కొద్దిరోజుల క్రితం మదనపల్లె మండలం గంగన్నగారిపల్లెలోని తన అక్క ఇంటికి వచ్చినపుడు అదే గ్రామానికి చెందిన మురళి కుమారుడు చరణ్‌తో పరిచయమైంది. పరిచయం ప్రేమగా మారడంతో నాలుగు నెలల కిత్రం ఇద్దరూ ఎక్కడికో వెళ్లిపోయారు. వారిద్దరూ వాయల్పాడులో ఉన్నట్లు గుర్తించిన యువకుడి తల్లి నాగరత్న భావన బంధువులతో కలిసి వెళ్లి ప్రేమ జంటను స్వగ్రామానికి తీసుకు వచ్చి భావనను ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించింది. కాగా, శనివారం ఉదయం భావనను తిరిగి తీసు కెళ్లారంటూ ఆమె బంధువులు విజయ్, భాస్కర్, చిన్ని కలసి మురళి, నాగరత్నతో ఘర్షణకు దిగ్గారు. పైపులతో నాగరత్నపై దాడి చేసి గాయపర్చారు. ఈ మేరకు తాలూకా సీఐ కళావెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం, హెచ్‌పీ గ్యాస్ సమీపంలో కాపురం ఉంటున్న అంజిమోహన్ కుమారుడు తేజాకుమార్ (34) వ్యాపారం చేస్తుంటాడు. శనివారం ఉదయం తల్లి మందలించిందని విషద్రావణం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

పీలేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం బండ్లవంక నుంచి ఈనెల 6న అదృశ్యమైన జోష్ణవిని పీలేరు పోలీసులు శనివారం గుర్తించారు. హాస్టల్ వెళ్లాలన్న బెంగతో ఆ బాలిక భయపడి ఇంటి నుంచి పారిపోయి తిరుమలకు చేరుకుంది. అక్కడ పలు మార్లు దైవదర్శనానికి వెళుతుండడాన్ని గమనించిన విజిలెన్స్ అధికారులు ఆమెను విచారించగా ఇంటి నుంచి పారిపోయి వచ్చి నట్లు తెలిసింది. దీంతో వారు పీలేరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పీలేరు పోలీసులు ఆమెను తీసుకువచ్చారు. పీలేరు సర్కిల్ కార్యా లయంలో ఆమెను ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అనంతపురం జిల్లా యాడికి మండలంలో ఘటన



విజయభాస్కర్‌రెడ్డి మృతదేహం

యాడికి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం అనంతపు రం జిల్లా యాడికి మండలం దైవాల మడుగు- చందన గ్రామాల మధ్య జరిగింది. ఈ సంఘటనలో కడప జిల్లా సింహాద్రిపురం మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన విజయ భాస్కర్ రెడ్డి (43) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు చెర్లోపల్లికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి నంద్యాల జిల్లా ప్యాపిలి వద్ద ఉన్న అరుణా చలేశ్వర ట్రాన్స్‌పో ర్ట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో 20రోజులకు ఒకసారి చెర్లోపల్లి గ్రామానికి వెళ్లి వస్తుండేవాడు. శనివారం ఉదయం విధు లను ముగించుకొని సొంత గ్రామానికి ద్విచక్రవాహనంపై బయ ల్దేరాడు. దైవాలమడుగు- చందన గ్రామాల మధ్య రోడ్డు మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దీంతో విజయభాస్కర్‌రెడ్డి వ్యవసాయ పొలంలోకి ఎగిరిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అత డు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలి పారు. మృతుడి భార్య అమరావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

అంతర్‌రాష్ట్ర గజదొంగ అరెస్ట్

- 102 గ్రాముల బంగారం, రూ.75 వేలు నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న రంగనాథం కిరణ్ అనే వ్యక్తిని అన్నమయ్య జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాయచోటి పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి వివరాలను వెల్లడించారు. ఉమ్మడి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని గూడూరు పట్టణం గాంధీనగర్‌కు చెందిన రంగనాథం కిరణ్ అనే వ్యక్తి బేకరీలో పని చేసేవాడు. అక్కడ వచ్చే డబ్బు వ్యసనాలకు చాలకపోవడంతో బస్టాండు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో చోరీలు చేసేవాడు. క్రమంగా ఇళ్లలో చోరీలకు అలవాటుపడ్డాడు. అన్నమయ్య జిల్లా పరిధిలోని వీరబల్లి, చిట్వేలు, రైల్వేకోడూరు ప్రాంతా ల్లో చోరీలు చేశాడు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, రూరల్ సీఐ వరప్రసాద్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సబ్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, వీరబల్లి



వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ, స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, నగదు

ఎస్‌ఐ నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శనివారం వీరబల్లి మండలం ఓదివీడు గ్రామం క్రాస్ వద్ద నిందితుడిని అరెస్టు చేసి 10 లక్షల విలువ చేసే 102 గ్రాముల బంగారు నగలు, రూ.75వేలు నగదు స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరుపెట్టినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. నిందితుడు అన్నమయ్య జిల్లాతో పాటు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, విశాఖపట్నం, ఎన్టీఆర్, కృష్ణ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, ప్రకాశం, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో మొత్తం 60 కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు తెలియజేశారు. ఇతర రాష్ట్రాల్లో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడని వివరించారు. ఈసందర్భంగా పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించినట్లు తెలిపారు.

పోక్సో కేసులో యువకుడు అరెస్టు : డీఎస్పీ వెల్లడి

వేంపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి ఓ మైనర్ బాలికను నమ్మించి మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. శనివారం వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వేంపల్లె మండలం పక్కీరుపల్లెకు చెందిన మడక బాబు ప్రేమపేరుతో మైనర్ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. వీళ్లు గత మూడేళ్లుగా పలుమార్లు కలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదీ మేకలు మేపుకునేందుకు బాలిక వెళ్లింది. అక్కడ నుంచి మడక బాబుకు ఫోన్ చేసి రావాలని కోరగా యువకుడు వెళ్లాడు. ఆ సమయంలో తండ్రి రావడంతో బాలిక యువకుడిని వెళ్లిపోవాలని చెప్పి భయంతో అడవిలోకి పారి పోయింది. దీంతో బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన మడక బాబు, అతని స్నేహితులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారి స్తుండగా... బాలిక తరఫు బంధువులు పోలీసు స్టేషన్‌ను ముట్ట డించి తీవ్ర గందరగోళం సృష్టించారు. రాత్రికి బాలిక ఆచూకీ లభ్యం కావడంతో రిమ్స్‌కు తరలించి చికిత్స చేయించారు. మహిళా ఎస్‌ఐ జ్యోతి బాలిక నుంచి వివరాలు సేకరించగా ఇరువురు ప్రేమలో ఉన్నామని, చాలా సార్లు కలుసుకున్నామని వెల్లడించింది. మైనర్ బాలిక అయినందున



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

యువకుడిపై కేసు నమోదు చేశామన్నారు. చక్రాయపేట బస్టాండ్ వద్ద ఉండగా శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కాగా, బాలిక అదృశ్యం ఘటన నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ ముట్టడించిన వారిపై కేసు నమో దు విషయంపై ఎస్పీ అశోక్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి చర్చి స్తామ న్నారు. న్యాయ సలహా తీసుకున్న తర్వాత కోర్టులో అపీల్ చేస్తామ న్నారు. సీఐ నరసింహులు, ఎస్‌ఐలు తిరుపాల్ నాయక్, రంగారావు పాల్గొన్నారు.

అనుమానాస్పద కేసును ఛేదించిన పోలీసులు

ఖాజీపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పనపల్లె గ్రామానికి చెందిన నక్కా శ్రీనివాసులు అనుమానాస్పద మృతి కేసును ఛేదించినట్లు సీఐ మోహన్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఖాజీపేటలో శనివారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అప్పనపల్లెకు చెందిన నక్కా శ్రీనివాసులుకు ఇరువురితో వివాహం జరిగింది. మొదటి భార్య లక్ష్మీదేవి వదలిపెట్టి వెళ్లడంతో చాపాడుమండలం తిప్పిరెడ్డిపల్లెకు చెందిన సునీతను 13 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. మద్యం మత్తులో పిల్లల ముందే తనను కొడుతుండగా.. ఆమె ఒక్కసారిగా తోయడంతో పక్కన ఉన్న మంచుకోడు తగులుకుని కింద పడ్డాడు. అయితే భర్త లేస్తే తనను చంపుతాడన్న భయంతో తిరిగి మంచంకోడుకు తలను కొట్టడంతో మృతి చెందాడు. కాగా ఈ విషయం బయటకు వస్తే పిల్లలు అనాథలు అవుతారని ఉరి వేసుకుని చనిపోయాడని నమ్మించి... మొదటి భార్య లక్ష్మీదేవికి సమాచారం ఇవ్వకుండా జూన్ 12వ తేదీ దహన కార్యక్రమాలు నిర్వహించారు. అయితే మొదటి భార్య అనుమానం వ్యక్తం చేసి జూలై 1వ తేదీ ఫిర్యాదు చేయగా 2వ తేదీ తహసీల్దారు, రిమ్స్ డాక్టర్లు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఎ



నిందితురాలితో సీఐ మోహన్, పోలీసులు

క్కడ నిజం బయట పడుతుందోనని అతని రెండో భార్య సునీత స్థానిక సచివాలయంలో పనిచేసే సెక్రటరీ భాగ్యశ్రీని కలిసి నిజం చెప్పడంతో ఆమేరకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సునీతను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ మోహన్ తెలిపారు.

వృద్ధురాలి తలపై ఇటుకతో మనవడి దాడి

- చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి
- ఇద్దరిపై హత్య కేసు నమోదు

పెద్దమండ్యం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి తలపై మనవడు ఇటుకతో దాడి చేయడంతో గాయపడిన ఆమె చికిత్స పొం దుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలి పారు. వివరాల్లోకెళితే... పెద్దమండ్యం మం డలం దిగువపల్లి వాసి లక్ష్మయ్య, నల్లమ్మ దంపతులకు నలుగురు కొడుకులు, ఒక కూతురు వున్నారు. వీరందరికీ పెళ్లిళ్ళు అయ్యాయి. తండ్రి లక్ష్మన్న మృతి చెంద డంతో నల్లమ్మను నెలకు ఒక కొడుకు పోషించేలా నలుగురు అన్నదమ్ములు తీర్మానించుకున్నారు. ఈ క్రమంలో కొడుకు ఆర్.చంద్రశేఖర్‌నాయుడు వంతు రాగా జూలై 1వ తేదీన వారి ఇంటికి నల్లమ్మ వెళ్లింది. పోషణకు ఇష్టం లేని చంద్రశేఖర్‌నాయుడుపై అతని భార్య భాగ్యమ్మ తరుచూ గొడవ పడేది. కాగా 10వ తేదీన చంద్రశేఖర్‌తో భాగ్యమ్మ గొడవ పడింది. అత్త నల్లమ్మను ఇంటి నుంచి పంపేయాలని రాయచోటిలో డిగ్రీ చదువుతూ హాస్టల్‌లో ఉన్న కొడుకు నాగేంద్రనాయుడును భాగ్యమ్మ ఫోన్ చేసి ఇంటికి రప్పించింది. ఈ గొడవలకు కారణం నాయనమ్మ నల్లమ్మేనని భాగ్యమ్మ కొడుకును రెచ్చగొట్టింది. ఆదే రోజు సాయంత్రం నల్లమ్మతో భాగమ్మ గొడవ పడుతుండగా నల్లమ్మ (79) తల వెనుక



నల్లమ్మ (ఫైల్‌ఫొటో)

భాగంలో నాగేంద్రనాయుడు ఇటుక రాయితో దాడి చేశాడు. అంతేకాకుండా ఆమె ఛాతిపై కూర్చుని పిడిగు ద్దులు గుద్దడంతో ఆమె స్పృహ కోల్పోయింది. గమనిం చిన సమీప బంధువులు చికిత్స నిమిత్తం 108 వాహ నంలో తంబళ్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్‌చేశారు. ఆమె చికిత్స పొందుతూ 11వ తేదీ రాత్రి మృతి చెందింది. పెద్దమండ్యం పోలీసులకు 12వ తేదీ శనివారం రాజశేఖర్ నాయుడు(నల్లమ్మ పెద్ద కొడుకు రమణనాయుడు కొడుకు) ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ములకలచెరువ ఇన్‌చార్జ్ సీఐ జీవన్ గంగాధర్‌బాబు వెల్లడించారు. నల్లమ్మ మృతికి కారణమైన భాగ్యమ్మ, నాగేంద్ర నాయుడు ఇద్దరిపై హత్య కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలి పారు. మదనపల్లి డీఎస్పీ మహేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీ లించారు. డీఎస్పీ వెంట ములకలచెరువు ఇన్‌చార్జ్ సీఐ, పెద్దమం డ్యం ఎస్‌ఐ వెంకటరమణ, పోలీసు సిబ్బంది వున్నారు. నల్లమ్మ నలు గురు కొడుకుల్లో ఇద్దరు కోనేళ్ల కిందట మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. దిగువపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కన్నెమడుగు హైస్కూల్‌కు రూ.లక్ష విరాళం



విరాళ చెక్కును అందచేస్తున్న పూర్వ విద్యార్థి మధుకర్‌రెడ్డి

తంబళ్లపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నెమడుగు ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి మధుకర్‌రెడ్డి రూ.లక్ష చెక్కును విరాళంగా అందచేశాడు. 10న పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎం 2.0 కార్యక్రమానికి పాఠశాలలో చదివిన పలువురు పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాల అభివృద్ధి నిమిత్తం మరిమిరెడ్డిగారిపల్లె వాసి బి.మల్‌రెడ్డి, సరోజమ్మ దంపతుల కుమారుడు మధుకర్‌రెడ్డి, అనుపమ దంపతులు రూ.లక్ష చెక్కును ఎంఈఓ నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎం మదన్‌మోహన్‌కు అందచేశారు. మధుకర్‌రెడ్డి దాతృత్వాన్ని సర్పంచ్ శివకుమారి, ఎస్‌ఎంసీ చైర్మన్ రెడ్డిశేఖర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లితండ్రులు అభినందించారు.

కేబుల్ వైర్లు చోరీ.. పోలీసులకు ఫిర్యాదు

నిమ్మనపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కేబుల్ వైర్ల దొంగలు మళ్లీ చెలరేగారు. రెండు పంచాయతీల్లో దాదాపు 15 మంది రైతులకు చెందిన కేబుల్ వైర్లను దొంగలించారు. శనివారం తవళం, ముష్టూ రు పంచాయతీల్లో దాదాపు 900మీటర్ల కేబుల్ వైర్లు ఎత్తు కెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సిద్ధపూజతో వేడుకగా ప్రారంభమైన

యల్లమ్మ జాతర వేడుకలు

కలికిరి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులు జరుగనున్న స్థానిక పురాతన గ్రామ దేవత యల్లమ్మ జాతర శనివారం సిద్ద పూజతో సంప్రదాయబద్ధంగా వైభవంగా ప్రారంభమైంది. ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్ రెడ్డి దంపతులు తిరు ఆభరణాలు, పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం అమ్మవారికి విశేష అలంకరణలు చేసి దర్శనానికి సిద్ధం చేశారు. భక్తుల సందర్శనానంతరం రాత్రి యల్లమ్మ జీవిత చరిత్ర హరికథను ఏర్పాటు చేశారు. భక్తులు జాగరణలో పాల్గొంటారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగు రంగుల విద్యుద్దీపాలంకరణతో మిరుమిట్లు గొలిపేలా అలంకరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా శనివారం నుంచే పట్టణం జాతర శోభతో కిటకిటలాడుతోంది. భక్తులను అలరించడానికి వివిధ వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారు రథాశీనులై పురవీధుల్లో విహరించనున్నారు. సాయంకాలం పెద్ద సంఖ్యలో మహిళలు దివ్వెలు బోనాలు అమ్మవారికి సమర్పిస్తారు. రాత్రంతా చాందినీ బండ్ల వేడుకలతో పట్టణం మొత్తం శోభాయమానంగా మారనుంది. ఆ తరువాత వివిధ ప్రాంతాల నుంచి హాజరైన వారు మొక్కుబడులను చెల్లించుకుంటారు. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్ రెడ్డి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి చాందినీ బండికి సిబ్బందిని ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తున్నారు. రాత్రంతా తమకు కేటాయించిన చాందినీ బండిని పోలీసులు అనుసరించాల్సి వుంటుంది. అసాంఘిక కార్యక్రమాలకు చెక్‌పెట్టేందుకు బాధ్యులుగా నియమిస్తున్నారు.




బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు అమ్మవారికి సమర్పిస్తున్న ధర్మకర్త కుటుంబం - విద్యుత్‌దీప కాంతులతో మిరుమిట్లు గొలుపుతున్న యల్లమ్మ తల్లి ఆలయం

ప్రభాకర్‌రెడ్డి లేని లోటు తీరనిది

మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ● అంత్యక్రియల్లో పలువురు నేతల నివాళి

వాల్మీకిపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కంభం ప్రభాకర్‌రెడ్డి లేనిలోటు పార్టీకి తీరనిదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి గద్గద స్వరంతో అన్నారు. వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి తండ్రి ప్రభాకర్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న ఆయన శనివారం ఉదయం బెంగళూరు నుంచి నేరుగా కంభంవారిపల్లె చేరుకున్నారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రభాకర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిరంజన్‌రెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తూ ఆయన ధైర్యం చెప్పారు. నల్లారి కుటుంబానికి కంభం కుటుంబానికి ఉన్న సన్నిహిత సంబంధాన్ని గుర్తు చేసుకుని బాధపడుతూ ఆయన లేని లోటు తీరనిదన్నారు. నల్లారి సోదరులు ఇద్దరూ ప్రభాకర్ రెడ్డి అంత్యక్రియలు పూర్తయ్యేదాకా నిరంజన్‌రెడ్డి కుటుంబ సభ్యుల వెన్నంటే ఉండటం గమనార్హం. ఉదయం 11గంటలకు కంభం ప్రభాకర్‌రెడ్డి అంత్యక్రియలు కంభంవారిపల్లెలో నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాల నుంచి వివిధ పార్టీల నేతలు, బంధువులు హాజరై ప్రభాకర్ రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి, పలువురు ప్రముఖులు అంత్యక్రియలకు హాజరయ్యారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు కంభం కుటుంబీకులు, గ్రామ ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కంభం ప్రభాకర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర అధ్యక్షుడు పగిడాల సిద్దయ్య

పీలేరు రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో దూదేకుల, నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిడాల సిద్దయ్య డిమాండ్ చేశారు. స్థానిక పద్మావతి నగర్‌లో నూర్ బాషా, దూదేకుల ఎప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ తరహాలో దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. మైనారిటీ బాండ్ ఏర్పాటు చేసి దామాషా ప్రకారం రాజకీయాల్లో ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇండియన్ ఇస్లాం దూదేకుల శాశ్వత ప్రభుత్వ జీఓ ఇవ్వాలని కోరారు. విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ రాజాసాహెబ్, కేవీపల్లె ఎంఈఓ పసుపులేటి రెడ్డిబాషా మాట్లాడుతూ అన్ని సమస్యల పరిష్కారానికి చదువే ప్రధాన మార్గమన్నారు. సమష్టి కృషితో ఏదైనా సాధించవచ్చని తెలిపారు. ఎస్వీయూ మాజీ సెనేట్ మెంబర్ వేంపల్లె అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నేతలు ఎస్. ఖాదర్‌బాషా, పసుపులేటి రహమత్‌బాష, కాసల మునాఫ్, ఖాజాపీర్, కే. ఫరీద్, కే. హనీఫ్, వజ్రాల అల్తాఫ్ పాల్గొన్నారు.



రాష్ట్ర అధ్యక్షుడు పగిడాల సిద్దయ్యను సన్మానిస్తున్న అసోసియేషన్ నేతలు

మండల తెలుగు యువత అధ్యక్షుడిగా శీతారాం

కురబలకోట, జూలై 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడిగా ఎస్.శీతారాంను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంగళ్లకు చెందిన ఆయన కౌన్సిలర్‌గా పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించి ఆయనకు పదవిని అప్పగించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం, వారికి అండగా ఉంటానన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన నియోజకవర్గ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ మల్లికార్జుననాయుడు తదితరులకు కృతజతలు తెలిపారు.



విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు

వాల్మీకిపురం, జూలై 12(ఆంధ్ర జ్యోతి): మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, ముందస్తు సమాచారంతో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. మండల వ్యాప్తంగా ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మరమ్మతులు పూర్తి చేశారు. విద్యుత్ లైన్లపై ప్రమాదకరంగా ఉన్న చెట్ల తొలగింపు, విద్యుత్ లైన్ల పునరుద్ధరణ, తదితర సమస్యలు పరిష్కరించి మధ్యాహ్నం 1గంటకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏఈ రాజశేఖర్, సబ్ ఇంజనీర్ జాకీర్‌హుస్సేన్, లైన్‌మెన్‌లు సిబ్బంది పాల్గొన్నారు.



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జ్యోతీబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ రెడ్డి తెలిపారు. 5వ తరగతిలో 11 సీట్లు, 6లో 4 సీట్లు, తొమ్మిదో తరగతిలో 1 సీటు అందుబాటులో వున్నట్లు ఆయన తెలిపారు. ఇంగ్లీషు మీడియంలో మాత్రమే ప్రవేశాలుంటాయన్నారు. ఈ సీట్లు భర్తీ చేయడానికి ఈ నెల 20న స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని, ఉదయం 10.30 నుంచి పరీక్ష జరుగుతుందన్నారు. పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్సు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి తీసుకున్న స్టడీ సర్టిఫికెట్టు జతచేసి ఈ నెల 18 లోగా దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తులను పాఠశాలలోనే సమర్పించి అప్పుడే హాల్ టికెట్టు పొందవచ్చన్నారు.

ఆగస్టు 15 నుంచి మహిళలకు

ఉచిత బస్సు ప్రయాణం : ఎమ్మెల్యే

పీలేరు/కలికిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలకు ఆగస్టు 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి ముఖ్యమంత్రి చంద్రబాబు మరో ఎన్నికల హామీని నెరవేర్చబోతున్నారని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి అన్నారు. సుపరిపాలన తొలి అడు గులో భాగంగా ఆయన ఆర్టీసీ నల్లగుట్ట ప్రాంతంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, ఏడాదిలోనే పట్టణంలో పెద్దఎత్తున సిమెంటు రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించామన్నారు. కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ద్వారా నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. అధికారులు, ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, టీడీపీ నేతలు కోటపల్లె బాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, మల్లెల రెడ్డి బాషా, పోలిశెట్టి సురేంద్ర, దేవిరెడ్డి వెంకట రమణారెడ్డి, రమాదేవి, షమ, కిశోర్, జీవీ రవికు మార్, పురం రెడ్డమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● కలికిరి మండలంలో పలుచోట్ల సుపరిపాలన-తొలి అడుగు విస్తృతంగా నిర్వహించారు. ఒక వైపు ఎమ్మెల్యే నల్లారి ఇంటింటా తిరుగుతుండగా మండలంలోని పలు పంచాయతీల్లో టీడీపీ నేతలు అభివృద్ధి పథకాల గురించి చెబుతున్నారు. రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మేడికుర్తి, మునేళ్లపల్లె, సంద్రావారిపల్లె పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ జాహీదా, ఎంపీటీసీ ఇనాముల్లా, రెడ్డిబాషా, డాక్టర్ రఫీ, బూత్ ఇన్ చార్జ్ ఖాదర్‌వల్లి పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి

జనరంజక పాలన

కలకడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభు త్వంతో రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోంద ని టీడీపీ నేత సి. మదన్‌మోహన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో కేవీ పల్లి మండలం మహల్‌రాజుపల్లి పంచాయతీలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇం టింటా ప్రజలను కలిసి సంక్షేమ పథకాలను వివ రించారు. నేతలు నాగరాజు, జి. చిన్నరెడ్డెప్ప, వెం కటరమణ, గురునాథ, మునిరెడ్డి పాల్గొన్నారు.

రేపు సంకష్ట హర చతుర్థి పూజలు



మదనపల్లె అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేవుట్ లోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం సంకష్ట హర చతుర్థి పూజలు నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని చెప్పారు. స్వామికి ప్రత్యేకంగా అంలకరణలు, విశేషపూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

కురబలకోట, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని రిడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య శనివారం పేర్కొన్నారు. ముదివేడు క్రాస్ కేజీబీవీ పాఠశాలలో రిడో సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అభయ-భవిత అనే అంశంపై బాలికల రక్షణపై అవగాహన కల్పించారు. బాలికలు విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు, ప్రయాణ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు సూచించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

పంచముఖ హనుమన్నకు విశేష పూజలు

కలకడ , జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటవారిపల్లెలో వున్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ఉదయాన్నే వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, ఆకు పూజ కార్యక్రమాలు జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో ప్రజలు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వైభవంగా శనీశ్వరస్వామికి మహాతైలాభిషేకం

వాల్మీకిపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపథం సమూహాలయంలో శనివారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో మూలవర్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. శనీశ్వర స్వామికి మహాతైలాభిషేకం, సప్తధాతు అభిషేకం, మహాకాల శని మృత్యుంజయ హోమం విశేషాలం కరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి



విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ సాయిశ్రీ

వాల్మీకిపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిశ్రీ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డెంగ్యూ, మలేరియా, అతిసార, కళ్లకలక తదితర వాటిపై అవగాహన కల్పించారు. వసతి గృహాల్లో వంట గదులు పరిశీలిస్తూ శుభ్రత, జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పిల్లలకు స్వచ్ఛమైన తాగు నీరు ఇవ్వాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ, సీహెచ్‌ఓ అరుణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేస్తాం

మదనపల్లె టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): కృష్ణచైతన్య ఫార్మసీ కళాశాల విద్యార్థులందరికీ వారి సర్టిఫికెట్లు తిరిగి ఇచ్చేస్తామని కళాశాల కరెస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 23 ఏళ్లుగా తమ కళాశాలలో చదివిన విద్యార్థులకు ఎక్కడా ఇబ్బంది పెట్టలేదన్నారు. గిట్టని వారు కొందరు సబ్‌కలెక్టర్, అధికారులకు ఫిర్యాదు చేయించారన్నారు. విద్యార్థుల టెన్త్, ఇంటర్, ఆదాయ, కులధృవీకరణ పత్రాలు తమ వద్ద భద్రంగానే వున్నాయన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విద్యార్థులు వారి సర్టిఫికెట్లు కావాలని తమకు దరఖాస్తు చేసుకుంటే సర్టిఫికెట్లు ఇచ్చేస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణచైతన్య ఫార్మసీ కళాశాల డైరెక్టర్లు గోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులతో సమీక్ష

మదనపల్లె అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జనచేతన ప్రివెన్షన్ యూనిట్‌ను దిశా క్లస్టర్స్ ప్రోగ్రామ్ మేనేజరు డాక్టర్ భాస్కర్ సందర్శించారు. అనంతరం ఉద్యోగులతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా ఉద్యోగులు పనితీరును విచారించినట్లు తెలిపారు. గ్రాఫ్‌ను ఈ నెల చివరిలోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యాలయ రికార్డులు, డాక్యుమెంట్స్‌ను ఆయన తనిఖీ చేసినట్లు తెలిపారు.



ఉద్యోగులతో సమావేశమైన దిశాక్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజరు భాస్కర్

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం తాళలేక విషద్రావణం తాగి మహిళ ఆత్మహత్యకు యత్నించింది. తాలుకా ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు పోతబోలు వాసి సాగర్‌రెడ్డి భార్య కృష్ణవేణి కొద్ది రోజులుగా అనాగరోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. దీంతో తను జీవితంపై విసుగు చెంది శనివారం ఉదయం విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లాప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

ఒత్తిడులకు తలొగ్గద్దు

మదనపల్లె టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ, మున్సిపల్ స్థలాలు ఆక్రమణలు తొలగించడంపై అధికారులు రాజకీయ ఒత్తిడులకు తలొగ్గద్దని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ కోరారు. ఆర్అండ్‌బీ, మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై తాము సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. బీవైఎస్ నేతలు హరీష్, జిలాని, హరికృష్ణ, రెడ్డిశేఖర్, శ్రీనివాసులు, శశి పాల్గొన్నారు.

మాజీ సీఎం నల్లారికి స్వాగతం

మదనపల్లె అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డికి చీకలబైలు వద్ద మదనపల్లె బీజేపీ నేతలు ఘనంగా పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మాజీ సీఎం హైదరాబాదు నుంచి బెంళూరుకు వచ్చి అక్కడ నుంచి మదనపల్లె మీదుగా కలికిరి విచ్చేసి, కంభం ప్రభాకర్‌రెడ్డి అంత్యక్రియలకు హాజరయ్యారు మదనపల్లె బీజేపీ నేతలు బండి ఆనంద్, వరదారెడ్డి నారథరెడ్డి, మదనపనల్లె రూరల్ అధ్యక్షుడు వెంకట రమణారెడ్డి, పులి నరేంద్రకుమార్‌రెడ్డి పలువురు నేతలు సన్మానించి స్వాగతం పలికారు.

దరఖాస్తుల స్వీకరణ

పీలేరు రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ రాధారాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ 5వ తరగతిలో 48 సీట్లు, 6లో 10 సీట్లు, 7లో 2 సీట్లు, 8లో 3 సీట్లు, 9లో 5 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ జిరాక్స్, స్టడీ సర్టిఫికెట్ తీసుకు రావాలని తెలిపారు.

నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు : సీఐ

మదనపల్లె అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): నిజా నిజాలు తెలుసుకోకుండా ఆధారాలులేని ఆరోపణలు చేయడం సరికాదని తాలుకా సీఐ కళా వెంకటరమణ అన్నారు. ఆయన మాట్లాడుతూ అంకిశెట్టిపల్లె రెవెన్యూ గ్రామ సర్వేనెంబరు 15 ప్రభుత్వ స్థలం. ఇందులో నల్లగుట్టపైన బుద్ధుని విగ్రహాలను ఏర్పాటు చేశారన్నారు. గుట్టపైన నిర్మానుష్య ప్రదేశంలో జూలై 2 తేదీ కంటే ముందే బుద్ధుని విగ్రహం ధ్వంసం చేశారని దీనిపై వీఆర్వో నారాయణ ఫిర్యాదు మేరకు మదనపల్లె తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాపు చేస్తూ, ఈ ప్రదేశంలో టవర్ డంప్ తీసుకుని, సెల్‌ఫోన్స్ నెంబర్లను కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఎవరి వద్దనైనా విలువైన సమాచారం ఉంటే తమకు తెలియజేస్తే దర్యాప్తు ఆకోణంలో కూడా నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం బుద్దుని కొండ, బుద్దుని విగ్రహం ఏర్పాటు చేసిన ప్రదేశం ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు రెవెన్యూ అధికారుల ద్వారా తెలిసిందన్నారు. నిర్మానుష్యమైన ప్రభుత్వ భూమిలో విగ్రహాలను ఏర్పాటు చేసి పోలీసులు సక్రమంగా స్పందించలేదని ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. ఇందులో కొందరు వర్గవిభేదాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంతవరకు బయట మీడియాతో మాట్లాడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న వ్యక్తులు ఏ ఒక్కరూ కూడా దర్యాప్తులో పోలీసులకు సహకరించలేదన్నారు.

ఇదీ రోగుల వెయిటింగ్ హాల్ !

వాల్మీకిపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల, సహాయకుల వెయిటింగ్ హాల్ భవనాలు దుస్థితికి చేరుకోవడం గమనార్హం. నిత్యం ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల కోసం ఏర్పాటు చేసిన వెయిటింగ్ హాల్ భవనాలను చూస్తే పశువుల దొడ్డి కన్నా హీనంగా తయారైందని విమర్శిస్తున్నారు. భవనాలకు ఎటువంటి రక్షణ లేకపోయినా పాడుబడ్డ భవనాలను తలపిస్తుండడం గమనార్హం. వైయిటింగ్ హాల్ ఎదుట బోర్డు ఘనంగా ఉన్నా లోపలి భాగం రేకులు మొత్తం కూలిపోయి శిథిలాలను తలపిస్తోంది. ఈ వైయిటింగ్ హాల్ భవనాలపై అధికారులు సైతం ఏ మాత్రం దృష్టి సారించడం లేదని ఇప్పటికైనా చర్యలు చేపట్టి రోగులకు, వారి వెంట వచ్చే సహాయకులకు ఇబ్బందులు తలెత్తకుండా మరమ్మతులు పూర్తి చేయాలని లేదా వైయిటింగ్ హాల్ పునర్నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పీహెచ్‌సీలో రోగుల వెయిటింగ్ హాల్, కూలిపోయిన భవనాల లోపలి భాగం